


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 193 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 19 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :193 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 19 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# నోటు ఇస్తేనే సేవలు..




## తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో అవినీతి దూకుడు




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మార్చి 18:** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపాలి టీలో అవినీతి వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైస్థాయి నుంచి కిందస్థాయి వరకు "నోటు పట్టు – పని పట్టు" అనే విధానం అమలవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రజలకు అందా ల్సిన సేవలు కూడా లంచాలకే పరిమితమవు తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.లంచం ఇస్తే చకాచకా పని... ఇవ్వకపోతే ఫైల్ మూలనమున్సిపాలిటీలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే– లంచం ఇచ్చిన వారి ఫైళ్లు వేగంగా కదులుతున్నాయి. వారం రోజుల్లోనే సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయి. అగ్ర తాంబూలం ఇచ్చి "పువ్వుల్లో పెట్టినట్టు" గౌరవంగా సర్టిఫికెట్లు అందజేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.అదే లంచం ఇవ్వని వారి ఫైళ్లు కార్యాలయ మూలన పడేసి, నెలలు గడిచినా కదలడం లేదని ఆరోపిస్తున్నారు.

**ఏసీబీ ట్రాప్ భయం... అయినా మారని వ్యవహారం**

ఇటీవల ఏసీబీ నిర్వహిస్తున్న ట్రాప్ కేసులు రాష్ట్రవ్యాప్తంగా అధికారుల్లో కొంత భయం కలిగించినప్పటికీ, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో మాత్రం పరిస్థితి పెద్దగా మారలేదని స్థానికులు చెబుతున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులు ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం అదే పాత విధానం కొనసాగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. "ఎప్పుడు ఏసీబీ ట్రాప్ పడుతుందో" అన్న భయం ఉన్నప్పటికీ, కొందరు అధికారులు దాన్ని లెక్కచేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

**జవాబుదారీతనం అవసరం**

ప్రస్తుతం అధికారులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం కొందరు కీ రోల్ లో ఉన్న అధికారుల వల్ల అవినీతి పెరుగుతోందని ప్రజలు అంటున్నారు.

లంచం తీసుకున్నా, ఫైళ్లు క్లియర్ చేయడం లో ఆలస్యం చేసినా చర్యలు లేకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చుతోంది.

1. సడెన్ ఏసీబీ ట్రాప్‌లు పెంచాలి (ఏసీబీ) తరచూ డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించి లంచగొండితనంపై కఠిన చర్యలు తీసుకోవాలి.
2. ఆన్‌లైన్ సేవలు తప్పనిసరి చేయాలి సర్టిఫికెట్లు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే విధానం అమలు చేయాలి.
3. టైమ్ బౌండ్ సర్వీసులు ప్రతి సేవకు గడువు నిర్ణయించి, ఆలస్యం అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.
4. ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసే విధంగా టోల్ ఫ్రీ, ఆన్‌లైన్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి.
5. కఠిన చర్యలు లంచం నిర్ధారణ అయితే వెంటనే సస్పెన్షన్, డిపార్ట్మెంటల్ విచారణ చేపట్టాలి.

**ప్రజల విజ్ఞప్తి :**

ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ )తక్షణమే తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ప్రత్యేక దృష్టి సారించి ట్రాప్‌లు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ముగింపు:

"లంచం ఇస్తేనే పని" అనే పరిస్థితి కొనసాగితే ప్రజాస్వామ్యంపై నమ్మకం దెబ్బతింటుందని, ఆ దిశ గా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో అవినీతి నిర్మూలన కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### కోర్లేషన్ సర్టిఫికెట్‌కు ఫిక్స్ రేట్లు

**అత్యవసరంగా 24 గంటల్లో కావాలంటే రూ.15,000 - రూ.20,000**

**సాధారణంగా 10- 15 రోజుల్లో కావాలంటే రూ.5,000 - రూ.7,000**

**లంచం లేకుండా ఫైల్ ముందుకు కదలని పరిస్థితి నెలకొంది.**

**మండల రెవెన్యూ కార్యాలయాల్లో కూడా అదే పరిస్థితి**

**మున్సిపాలిటీతో పాటు మండల రెవెన్యూ కార్యాలయాల్లో కూడా లంచం లేకుండా పనులు జరగడం కష్టమైందని బాధితులు వాపోతున్నారు. ప్రతి చిన్న పనికీ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అంటున్నారు.**

---

పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది..

## వారిని గుండెల్లో పెట్టుకుంటాం



- పోలవరం నిర్వాసితులకు మూడో విడతగా రూ.226 కోట్ల పరిహారం విడుదల
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాజెక్టు 6-7 ఏళ్లు ఆలస్యమైందన్న సీఎం చంద్రబాబు
- వారంలో కొత్త డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడి
- 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు రూ.1943 కోట్లు అందించిన ప్రభుత్వం
- ప్రభుత్వ సాయంతో తమ జీవితాలు బాగుపడ్డాయని నిర్వాసితుల హర్షం

పెన్ పవర్ డెస్క్:పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని, భూములు, ఇళ్లు త్యాగం చేసిన వారిని తమ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని చూసుకుం టుందని సీఎం చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. వారి త్యాగఫలితంగానే రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు సాకారం అవుతోందని అన్నారు. ఈరోజు తన క్యాంపు కార్యాలయంలో

- మిగతా2లో

## లాకప్‌లో నన్ను శారీరకంగా, మానసికంగా హింసకు గురి చేశారు

- తనను 18 రోజులు సెంట్రల్ జైల్లో ఉండేలా చేశారన్న అంబటి
- తన ఇంటిపై దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోలేదని మండిపాటు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శ



పెన్ పవర్ డెస్క్:సత్తెనపల్లి, నల్లపాడు, పట్టాభిపురం పోలీస్ స్టేషన్లలో తనపై నమోదైన అక్రమ కేసుల విషయంలో పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం

- మిగతా2లో



## 71 ఎకరాల వక్ఫ్ భూమిపై నారా లోకేశ్ కన్ను పడింది

- పరిశ్రమల పేరుతో వక్ఫ్ భూములు లాక్కునేందుకు జీవో ఇచ్చారన్న అంజాద్ బాషా
- 50 ఏళ్లు దాడిన ముస్లింలకు పెన్షన్ ఇస్తానన్న చంద్రబాబు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్న
- ముస్లింల విషయంలో చంద్రబాబుది ద్వంద్వ వైఖరి అని విమర్శ

పెన్ పవర్ డెస్క్:ముస్లింల పట్ల చంద్రబాబుకు ఉన్నది కపట ప్రేమ అని వైసీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా విమర్శించారు. జగన్ హయాంలో మైనారిటీల సంక్షేమం కోసం రూ. 24,304 కోట్లు ఖర్చు చేశారని కొనియాడారు. ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్‌లకు రూ. 5 వేలు గౌరవ

- మిగతా2లో



## ఢిల్లీలో ఎదురుపడిన సీఎం రేవంత్ రెడ్డి, వైసీపీ నాయకురాలు రోజా

- ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి
- నితిన్ గడ్కరీని కలవడానికి పార్లమెంటుకు వచ్చిన రోజా
- పార్లమెంట్ భవనంలో ఎదురుపడిన రేవంత్ రెడ్డి, రోజా
- షేక్ హ్యాండ్ ఇచ్చి పరస్పరం పలకరింపు

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా ఢిల్లీలో ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారు షేక్ హ్యాండ్ ఇచ్చుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో

- మిగతా2లో



## విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలపై అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన

- పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన అశ్వినీ వైష్ణవ్
- జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయినట్లు వెల్లడి
- జోన్ ప్రధాన కార్యాలయం భవనం పునాది పనులు పూర్తయ్యాయన్న కేంద్రమంత్రి

పెన్ పవర్ డెస్క్:రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఎంపీలు అడిగిన ప్రశ్నకు, ఆయన పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

- మిగతా2లో

## సౌదీ, ఖతార్, యూఏఈలోని చమురు, గ్యాస్ కేంద్రాలపై కొన్నిగంటల్లో దాడులు చేస్తాం

- ఇరాన్‌లోని అతిపెద్ద గ్యాస్ ఫీల్డ్ అయిన సౌత్ ఫార్స్ మౌలిక సదుపాయాలపై దాడి
- దీనికి ఇజ్రాయెల్, అమెరికా కారణమని ఇరాన్ ఆరోపణ
- ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్
- పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరికలు జారీ

పెన్ పవర్ డెస్క్:సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ లోని చమురు, గ్యాస్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. తమ ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులకు ప్రతికారం తీర్చుకుం టామని తెలిపింది. గల్ఫ్ దేశాల్లోని తమ కేంద్రాల నుంచి అమెరికా తమపై దాడులు చేస్తుండటంతో, పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ఆ దేశానికి చెందిన టెహ్రాన్ టైమ్స్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది.

- మిగతా2లో






80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో

## భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

- గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకున్న 'జగ్ లాడ్కీ'
- పుజైరాలోని పోర్టులో లోడ్ అయిన 'జగ్ లాడ్కీ'
- పుజైరాలో టెర్మినల్‌పై ఇరాన్ దాడి సమయంలో చమురు నింపుకుంటున్న 'జగ్ లాడ్కీ'

పెన్ పవర్ డెస్క్:భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కి' అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను పుజైరా పోర్టులో లోడ్ చేశారు. 'జగ్ లాడ్కి' మొత్తం

- మిగతా2లో



## బాబాయ్‌ని చంపిన అబ్బాయిలకు జైలు ఖాయం

- వివేకా హత్య కేసులో దోషులను కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపణ
- తాడేపల్లి ప్యాలెస్ స్క్రిప్ట్‌తోనే అవినాశ్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టారని విమర్శ
- కడప సీటు కోసమే హత్య జరిగిందన్న షర్మిల వాంగ్మూలంపై జగన్ మౌనాన్ని ప్రశ్నించిన అనురాధ
- దోషులను కాపాడేందుకు వివేకా వ్యక్తిత్వాన్ని కించపరచడం దారుణమని వ్యాఖ్య
- బాబాయ్‌ని చంపిన వారికి జైలు శిక్ష తప్పదని హెచ్చరిక

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

## పంచాంగం ప్రాధాన్యత

"కాల సృజతి భూతాని, కాలస్సంహరతే ప్రజా: కాలము చరాచర సృష్టికి, సృష్టి అంతానికి మూలాధారం. అందుకే కాలాన్ని దైవంగా భావిస్తారు. అలాంటి కాలాన్ని గురించి తెలుసుకు నేందుకు ఉపయోగపడే సాధనమే పంచాంగము. పంచాంగము అనగా పంచ+అంగము. కాలము యొక్క ప్రధాన అంగాలైన, విభాగాలైన తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అనే అయిదు అంగముల గురించి తెలుపుతుంది, కనుకనే పంచాంగము అని నమాంకితమైంది. మనం ప్రస్తుతం వాడుతున్న క్యాలెండర్ తేదీలు, మాసాలు, సంవత్సరాలను సూచిస్తుంది. ఋగ్వేదంలో నక్షత్ర ప్రస్తావన ఉంది. పంచాంగం గ్రహ గణితానికి మూలమైన, సూర్య సిద్ధాంతం 10వ శతాబ్దంకు ముందు పేర్కొన బడింది. విక్రమ శకాన్ని ఉత్తర, పశ్చిమ భారతావనిలో, నేపాల్ లో అనుసరిస్తారు. అలాగే శాలి వాహన శకమును దక్షిణ భారత దేశంలో, మహారాష్ట్ర, గోవా, ప్రాంతాలలో ఆచరిస్తారు. పూర్ణిమతో మొదలయ్యే నెలను పూర్ణిమాంత మాసమని, అమావాస్యతో పూర్తయ్యే మాసాన్ని అమాంత మాసమని అంటారు. మన దేశంలో అధిక ప్రదేశాలలో పూర్ణిమాంత మాసం వాడుకలో ఉంది. మనం అనుసరిస్తున్న కాలం ఆరు భాగాలుగా విభజితమైంది. సంవత్సరం, ఆయనము, ఋతువు, మాసం, పక్షం, దినం.ఇక వివిధ సంవత్సరాలను పరిశీలిస్తే....(1). చంద్రుని గమనం ఆధారంగా చైత్ర శుక్ల పాడ్యమి మొదలుకొని ఫాల్గుణ కృష్ణ అమావాస్య వరకు గల కాలాన్ని చాంద్రమాన సంవత్సరం అంటారు. (2). సూర్యుడు మేష రాశిలో ప్రవేశించి మీన రాశి వరకు సంచరించే కాల ప్రమాణాన్ని సౌరమాన సంవత్సరం అంటారు. (3). 30 రోజులకు ఒక నెల చొప్పున 360 రోజులతో పన్నెండు మాసాలు కలిగి ఉండేది సావన మాస సంవత్సరం. (4). అశ్విని నుండి రేవతి వరకు కలిగిన, నక్షత్రాల మీదుగా చంద్రుడు సంచారం చేసే కాలాన్ని ఒక నెలగా, ఇలా పన్నెండు నెలలు అంటే 324 రోజులు కలిగిన కాలం నాక్షత్ర మాన సంవత్సరం.(5). గురువు ఒక రాశిలో ప్రవేశించి ఆ రాశిలో ఉండే కాలానుగుణ్యాన్ని బార్హస్పత్యమాన సంవత్సరం అంటారు. ఇక ఆయనాల విషయానికి వస్తే, ప్రతి సంవత్సరం ఉత్తర, దక్షిణాయనాలు రెండు ఉంటాయి. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన దినం నుండి కర్కాటకం లో ప్రవేశించే వరకు ఉత్తరాయణం, తిరిగి మకరంలో ప్రవేశించే వరకు దక్షిణాయనం. ప్రతి రెండు మాసాలకు కలిపి ఒక ఋతువు. సంవత్సరానికి ఆరు ఋతువులు. చాంద్ర మానం ప్రకారం శుద్ధ పాడ్యమి నుండి అమావాస్య వరకు ఒక మాసం. అవి సంవత్సరానికి పన్నెండు ఉంటాయి. మాసానికి శుక్ల, కృష్ణ రెండుపక్షాలు. దినం అనగా సూర్యోదయం నుండి మొదలై తిరిగి సూర్యోదయంతో ముగిసేది. గ్రహాల పేర్లు ఆధారంగా దినాలకు పేర్ల నిర్ణయాలు జరిగాయి. గణనకు సంబంధించి, అవసరమైన సిద్ధాంత భాగం, ఖగోళ విజ్ఞానం పై ఆధారపడి ఉంటుంది. ఇదే పంచాంగ గణనకు మూలాధారం. గణనకు సంబంధించిన అంశాలను వివరించేవి సిద్ధాంత గ్రంథాలు. సూర్య: పితామహో వ్యాస: వసిష్ఠోత్రి పరాశర: కాశ్యపో నారదో గర్గ: మరీచిర్మనురంగిరా: లోమశ: పౌలిశశ్చైవ చ్యవనో యవనో భృగు: శైనకోష్టాదశ హ్యేతే జ్యోతిష శాస్త్ర ప్రవర్తకా: అని మన ప్రాచీన జ్యోతిష సిద్ధాంత కారుల గురించి శ్లోకాధారం. తర్వాతి కాలంలో, భాస్కరాచార్యుడు, వరాహమిహిరుడు, బ్రహ్మ గుప్తుడు, ఆర్యభట్టు తదితర సిద్ధాంత గ్రంథ కర్తలు ఎందరో ఉన్నారు. వరాహ మిహిరుడు తదితరులు పంచాంగ రూపంలో రాయడానికి అవసరమైన, విధానాలను రూపొందించారు. వాటిని తంత్ర గ్రంథాలు అంటారు. గణేశ దైవజ్ఞాది పండితులు కరణ గ్రంథాలను రచించారు. పంచాంగ గణన సులభం చేశారు. ప్రస్తుత కాలంలో, గ్రహలాఘవం, గణకానందం, నర కంఠీరవం, తిథి రత్నావళి, తిథి చంద్రిక తదితరాలు అందుబాటులో ఉన్నాయి.

మానవుడు దైనందిన జీవితంలో ఎన్నో రకాల పనులు చేస్తూ ఉంటాడు. అవి ఎలాంటి ఆటంకాలు లేకుండా, సత్ఫలితాలు పొందడానికి, విజయవంతంగా పూర్తి కావడానికి ఉచిత సమయంలో, ప్రారంభించడం అవసరం. కాల ప్రవాహంలో ఎలాంటి సమయం, సదరు వ్యక్తికి అనుకూల లేదా వ్యతిరేక ఫలితాలను ఇస్తుందో, తెలుసు కోడానికి పంచాంగం ఉప యుక్తమవుతుంది. ప్రధానంగా భారత దేశంలో, ప్రతి శుభ, అశుభ కార్యక్రమానికి పంచాంగం ద్వారా ముహూర్తాన్ని లెక్కించి, దానిని ఆచరించడం అనాదిగా వస్తున్న ఆచరణ. పంచాంగాన్ని విశ్వసించే మానవుడు, జన్మించింది మొదలు మరణించే వరకు, ప్రతి కార్యక్రమంలో పంచాంగాన్ని అనుసరిస్తున్నాడు. ఒకనాడు యజ్ఞ, యాగాది క్రతువులకు, సాంప్రదాయ సత్కర్మలకు ముహూర్తాలు నిర్ణయిం ప బడగా, నేడు బారసాల, కేశఖండనం, వివాహం, నామకరణం,గృహాది నిర్మాణ ప్రారంభాలు, ప్రవేశాలు, వ్రతాలు, పూజలు, ఒక్కటేమిటి అన్నింటికీ, హైందవ జీవన విధానంలో పంచాంగానికి విడదీయలేని, సంబంధం అనుబంధం ఉంది.

# బాబాయ్‌ని చంపిన అబ్బాయిలకు జైలు ఖాయం

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులను కాపాడేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన బృందం చేస్తున్న ప్రయత్నాలను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "బాబాయ్‌ని అత్యంత పాశవికంగా చంపేసిన అబ్బాయిలకు త్వరలోనే జైలు శిక్ష పడుతుంది" అని ఆమె జోస్యం చెప్పారు. ఇవాళ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్ మొత్తం తాడేపల్లి ప్యాలెస్ రాసిన స్క్రిప్ట్ ప్రకారమే సాగిందని అనురాధ విమర్శించారు. "కడప ఎంపీ సీటు కోసమే వివేకా హత్య జరిగిందని జగన్ సొంత చెల్లెలు వైఎస్ షర్మిల సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారు. దీనిపై జగన్ గానీ, అవినాశ్ గానీ ఎందుకు నోరు మెదపడం లేదు? న్యాయం కోసం పోరాడుతున్న సునీతమ్మపై కుట్రలు చేయడం సిగ్గుచేటు" అని మండిపడ్డారు.హత్య జరిగిన రోజు చోటుచేసుకున్న పరిణామాలను అనురాధ గుర్తుచేశారు. "ఆ రోజు సాక్షి ఛానల్‌లో రెండు గంటలకోసారి వార్త మార్చారు. గుండెపోటుతో మొదలుపెట్టి, చివరకు హత్య అని తేల్చారు. ఇదంతా జగన్ డైరెక్షన్‌లోనే జరిగింది. తెల్లవారుజామున 5 గంటలకే హత్య విషయం జగన్‌కు తెలిసినా, ఆయన నింపాదిగా 8 గంటల పాటు కారులో ప్రయాణించారు. ఆ ప్రయాణ సమయంలోనే 'రక్తం తుడిచేయండి, కుట్లు వేయండి' అని ఫోన్‌లో ఆదేశాలు ఇచ్చింది నిజం కాదా?" అని ఆమె నిలదీశారు. ప్రతిపక్ష నేతగా సీబీఐ విచారణ కోరిన జగన్, ముఖ్యమంత్రి అయ్యాక వద్దనడం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. సీబీఐ అరెస్టు నుంచి తప్పించుకోవడానికి అవినాశ్ రెడ్డి కర్నూలు ఆసుపత్రిలో దాక్కోవడాన్ని రాష్ట్ర ప్రజలు చూశారని అనురాధ పేర్కొన్నారు. కేసును నీరుగార్చేందుకు స్వయంగా జగనే, చనిపోయిన వివేకానంద రెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడటం అత్యంత దారుణమని అన్నారు. "అవినాశ్ రెడ్డి చెప్పినట్టు ఇది 'మర్డర్ ఫర్ గెయిన్' కాదు, ఇది 'మర్డర్ ఫర్ వైసీపీ పొలిటికల్ గెయిన్'. వైసీపీ రాజకీయ లబ్ధి కోసమే ఈ హత్య జరిగింది" అని ఆమె విమర్శించారు. ఎన్ని కుట్రలు పన్నినా సునీతకు న్యాయం జరిగి తీరుతుందని, హత్య వెనుక సూత్రధారులు, సాక్ష్యాలు తారుమారు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష అనుభవించక తప్పదని అనురాధ హెచ్చరించారు.

### పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది..

# వారిని గుండెల్లో పెట్టుకుంటాం

- మొదటి పేజి తరువాయి

పోలవరం నిర్వాసితులతో సమావేశమైన సీఎం, భూసేకరణ, పునరావాస ప్యాకేజీ కింద మూడో విడతగా రూ.226.61 కోట్ల చెక్కును వారికి అందజేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ మొత్తాన్ని నేరుగా నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రాం వాల్ పనులు వారం రోజుల్లో పూర్తి కానున్నాయని ఆయన ప్రకటించారు.

**21 నెలల్లో రూ.1943 కోట్ల పరిహారం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితులకు అండగా నిలుస్తోందని, గత 21 నెలల్లో మూడు విడతల్లో పరిహారం అందించామని సీఎం వివరించారు. 2025 జనవరిలో సంక్రాంతి కానుకగా తొలి విడత రూ.800 కోట్లు, గత ఏడాది దీపావళికి రెండో విడతగా రూ.916 కోట్లు, తాజాగా ఉగాది సందర్భంగా మూడో విడతగా రూ.226.6 కోట్లు జమ చేశామని తెలిపారు. ఈ 21 నెలల కాలంలో మొత్తంగా 26,149 మంది నిర్వాసితులకు రూ.1943 కోట్లు చెల్లించినట్లు స్పష్టం చేశారు. నిర్వాసితుల సంక్షేమం కోసమే రంపచోడవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాగా ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

**గత పాలకుల వల్లే ప్రాజెక్టు ఆలస్యం**

గత పాలకుల నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే డయాఫ్రాం వాల్ తీవ్రంగా దెబ్బతిన్నదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు నిపుణులతో అధ్యయనం చేయించి, సుమారు రూ.1000 కోట్లతో కొత్త డయాఫ్రాం వాల్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ చేతగానితనం వల్లే పోలవరం ప్రాజెక్టు 6-7 ఏళ్లు ఆలస్యమైందని, కాంట్రాక్టర్లను మార్చకుండా ఉంటే ఇప్పటికే పూర్తయ్యేదని విమర్శించారు. వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నాటి పాలకులు పట్టించుకోలేదని, ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదన్న అహంకారంతో వ్యవహరించారని మండిపడ్డారు.

**నిర్మాణ పనులు, పునరావాసం వేగవంతం**

వచ్చే ఏడాది ఉగాది తర్వాత రెండు నెలల్లోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, రాష్ట్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి గోదావరి పుష్కరాలు నిర్వహించే గౌరవం తనకు దక్కిందని, పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా 75 పునరావాస కాలనీలు నిర్మిస్తుండగా, ఇప్పటికే 26 పూర్తి అయ్యాయని, మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితులందరికీ పక్కా ఇళ్లతో పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం రూ.3.5 లక్షలు, ఇంటి జాగా కోసం ఇచ్చే పరిహారాన్ని రూ.2 లక్షలకు పెంచామని తెలిపారు. నిర్వాసిత యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తామని కూడా సీఎం హామీ ఇచ్చారు.

ప్రభుత్వం అందిస్తున్న పరిహారంతో తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్నాయని నిర్వాసితులు ముఖ్యమంత్రికి వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే తమకు న్యాయం జరిగిందని, తమ ఖాతాల్లోకి డబ్బులు వస్తున్నాయని చెబుతూ పలువురు మహిళలు భావోద్వేగానికి గురయ్యారు. చంద్రబాబే కలకాలం సీఎంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, ఆర్ అండ్ ఆర్ అధికారులు పాల్గొన్నారు.

# లాకప్‌లో నన్ను శారీరకంగా, మానసికంగా హింసకు గురి చేశారు

- మొదటి పేజి తరువాయి

ఉన్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లతో తనను 18 రోజుల పాటు సెంట్రల్ జైల్లో ఉంచేలా పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఇది సుప్రీంకోర్టు గత తీర్పులకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేశ్ చెబితేనే తనను కోర్టులో ప్రవేశ పెట్టారని మండిపడ్డారు.

తనను లాకప్‌లో ఉంచిన సమయంలో పోలీసులు శారీరక, మానసిక హింసకు గురిచేశారని, దీనిపై న్యాయపోరాటం చేస్తానని అంబటి అన్నారు. తన నివాసం, వాహనాల మీద ఏడు గంటల పాటు దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోకుండా ప్రేక్షక పాత్ర వహించారని, కానీ దాడి చేసిన వారికి మాత్రం వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది కేవలం పవన్ కల్యాణ్ కి మాత్రమే పరిమితమైందని... సామాన్య ప్రజలకు, ప్రతిపక్షాలకు ఇది 'ఆటవిక పాలన'గా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, పోలీసు వ్యవస్థను మేనేజ్ చేస్తే ఏమైనా చేయొచ్చనే అరాచక వాతావరణం నెలకొందని అంబటి దుయ్యబట్టారు. న్యాయవ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, ఎంతదూరమైనా వెళ్లి పోరాడతానని స్పష్టం చేశారు.

## అతడు బలహీనుడు, వెళ్లిపోవడం మంచిదే!..

# కౌంటర్ టెర్రరిజం చీఫ్ రాజీనామాపై ట్రంప్ వ్యాఖ్యలు

### జో కెంట్ రాజీనామాపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### భద్రతా వ్యవహారాల్లో కెంట్ విఫలమయ్యారని ఆరోపణ

### ఇరాన్ విధానాలపై అమెరికా ప్రభుత్వంలో తీవ్ర విభేదాలు



'అతడొక బలహీనుడు, యుద్ధ వ్యూహాల విషయంలో పనికిరాడు! అలాంటి వ్యక్తి వైదొలగడం దేశానికి మంచిదే!" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తన ప్రభుత్వంలో అత్యంత కీలకమైన కౌంటర్ టెర్రరిజం చీఫ్ జో కెంట్ రాజీనామాపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ తీవ్ర వ్యాఖ్యలతో అమెరికా ప్రభుత్వంలో ఇరాన్ విధానాలపై నెలకొన్న అంతర్గత పోరు ఒక్కసారిగా బట్టబయలైంది.పశ్చిమాసియాలో ఇరాన్‌తో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, ట్రంప్ సర్కార్ అనుసరిస్తున్న దూకుడు విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ జో కెంట్ తన పదవికి రాజీనామా సమర్పించారు. ఇరాన్‌పై దాడులు, ఆ దాడుల్లో అమాయక పౌరుల మరణాలు, ప్రాంతీయ అస్థిరత వంటి అంశాలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు వైట్‌హౌస్ వర్గాల కథనం. వ్యూహాత్మక విభేదాలు తారస్థాయికి చేరడంతోనే ఆయన ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

**ట్రంప్ నిప్పులు..**

ఒక కీలక అధికారి రాజీనామాపై సంయమనం పాటించాల్సింది పోయి, ట్రంప్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. "జో కెంట్ రాజీనామాను నేను స్వాగతిస్తున్నాను. దేశ భద్రత విషయంలో మెతక వైఖరి అవలంబించే వారికి నా ప్రభుత్వంలో స్థానం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకునే ధైర్యశాలురే నాకు కావాలి. కెంట్ వంటి వారు ఇక్కడ సరిపోరు. అతడు వెళ్లిపోవడం చాలా మంచిదైంది" అని ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. సొంత అధికారిపై అధ్యక్షుడే ఈ స్థాయిలో విమర్శలు చేయడం అమెరికా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

**బయటపడ్డ భిన్నాభిప్రాయాలు..**

ఈ రాజీనామా, ఆ తర్వాత ట్రంప్ వ్యాఖ్యలతో ఇరాన్ విషయంలో వైట్‌హౌస్‌కు, భద్రతా, నిఘా వర్గాలకు మధ్య తీవ్రమైన అగాధం ఏర్పడినట్లు స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయి వాస్తవాలను, భవిష్యత్ పర్యవసానాలను భద్రతా అధికారులు వివరిస్తుంటే, రాజకీయ ప్రయోజనాల కోసం దూకుడుగా ముందుకు వెళ్లాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోందనడానికి ఈ ఘటనే నిదర్శనం. అయితే, తన దూకుడు తగ్గించే ప్రసక్తే లేదని, ఇరాన్‌కు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఈ పరిణామం అమెరికా అంతర్గత రాజకీయాల్లోనే కాకుండా, మధ్యప్రాచ్య భౌగోళిక రాజకీయాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఢిల్లీలో ఎదురుపడిన సీఎం రేవంత్ రెడ్డి, వైసీపీ నాయకురాలు రోజా

- మొదటి పేజి తరువాయి

ఉన్న విషయం తెలిసిందే. అదే సమయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసేందుకు రోజా పార్లమెంటు భవనానికి వచ్చారు. ఈ సందర్భంగా ఇరువురు తారసపడ్డారు.రోజాను పలకరించిన రేవంత్ రెడ్డి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రేవంత్ రెడ్డితో వెంట ఉన్న నాయకులు ఏదో ప్రశ్నించగా, తాను పని మీద వచ్చానని ఆమె సమాధానం చెప్పారు. ఆ తర్వాత రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని రోజా పలకరించారు.

# 71 ఎకరాల వక్ఫ్ భూమిపై నారా లోకేశ్ కన్ను పడింది

- మొదటి పేజి తరువాయి

వేతనం ఇస్తామని జగన్ హామీ ఇచ్చారని... చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే ఇచ్చారని తెలిపారు. 50 ఏళ్లు దాటిన ముస్లింలకు పెన్షన్ ఇస్తానన్న చంద్రబాబు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈద్గాలు, ఖబరిస్థాన్ లకు భూములు ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు.

చినకాకాని వద్ద ఉన్న 71 ఎకరాల వక్ఫ్ భూమిపై మంత్రి నారా లోకేశ్ కన్ను పడిందని, పరిశ్రమల పేరుతో ఆ భూములను లాక్కునేందుకు జీవో ఇచ్చారని ఆరోపించారు. రాజధానిలో వేల ఎకరాలు ఉండగా వక్ఫ్ భూములే ఎందుకు కావాలని ప్రశ్నించారు. 1870 మంది హజ్ యాత్రకు వెళ్తే కేవలం 72 మందికే చంద్రబాబు ఆర్థిక సాయం చేశారని... ఈ ఏడాది వెళ్తున్న 2005 మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున సాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో హజ్ హౌస్ నిర్మాణం ఇప్పటికీ కాగితాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ముస్లింల విషయంలో చంద్రబాబు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు.

### విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలపై

# అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయినట్లు వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయం భవనం పునాది పనులు పూర్తయినట్లు తెలిపారు. అలాగే, ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వే లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని అన్నారు.

## సౌదీ, ఖతార్, యూఏఈలోని చమురు, గ్యాస్ కేంద్రాలపై కొన్నిగంటల్లో దాడులు చేస్తాం

- మొదటి పేజి తరువాయి

పొరుగున ఉన్న దేశాల్లోని చమురు, గ్యాస్ కేంద్రాలపై మరికొన్ని గంటల్లో దాడులు చేయనున్నట్లు తెలిపింది. ఇరాన్‌లోని అతిపెద్ద గ్యాస్ ఫీల్డ్ అయిన సౌత్ ఫార్స్ మౌలిక సదుపాయాలపై దాడి జరిగింది. దీనికి ఇజ్రాయెల్, అమెరికా కారణమని ఇరాన్ ఆరోపించింది. అలాగే ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల్లో ఇరాన్ నిఘా వ్యవహారాల మంత్రి ఇస్మాయిల్, సీనియర్ భద్రతా అధికారి అలీ లారిజానీ, బసీజ్ ఫోర్స్ అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ మృతి చెందారు. తమ దేశానికి చెందిన కీలక నాయకులు మృతి చెందడంతో ఇరాన్ తీవ్ర హెచ్చరికలు చేస్తోంది.

# 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

- మొదటి పేజి తరువాయి

పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది.ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది.మార్చి 14న ఫుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. 'జగ్ లాడ్కి' అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది.

ఇప్పటికే శివాలిక్, నందాదేవి నౌకలు హర్మూజ్ జలసంధిని గుండా ప్రయాణించి సురక్షితంగా భారత్ చేరుకున్నాయి. ఈ నౌకలు ఎల్పీజీ గ్యాస్‌ను తీసుకువచ్చాయి. సముద్రమార్గంలో జరిగే చమురు రవాణాలో ఐదవ వంతు హర్మూజ్ జలసంధి ద్వారా ఉంటుంది.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# ఉగాది పండుగ శుభాకాంక్షలు

## -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు పెన్ పవర్ మార్చి 18:**

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కందుకూరు నియోజకవర్గ ప్రజలకు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు. తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు కలిసిన ఉగాది పచ్చడి... జీవితంలో కష్టసుఖాలు కలిసే ఉంటాయన్న అర్థాన్ని సూచిస్తుందని, జీవితం మనకు అందించే ప్రతి అనుభవాన్ని ఆనందంగా స్వీకరించాలని ఎమ్మెల్యే అన్నారు. ఉగాది కొత్త సంవత్సరానికి నాంది పలుకుతూ అందరి జీవితాల్లో కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, కొత్త అవకాశాలను తీసుకువస్తుందని తెలిపారు. ఈ శుభసందర్భంలో ప్రతి కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్య సంపదలను అందించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

# అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### -దివ్యాంగుల కోసం ఉచితబస్సు ప్రయాణం - ప్రారంభించిన ఇంటూరి నాగేశ్వరరావు

### -దివ్యాంగులతో కలిసి భోజనం - బస్సు ప్రయాణం -అర్హులకు ఇళ్లస్థలాలు అందిస్తామని ఇంటూరి హామీ





**కందుకూరు పెన్ పవర్ మార్చి 18:**

రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాలకు మేలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. దివ్యాంగుల శక్తి పేరుతో, వారికి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమంలో, దివ్యాంగులతో కలిసి భోజనం చేశారు. తమకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన కూటమి ప్రభుత్వానికి దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 11 లక్షల మందికి పైగా దివ్యాంగులకు, ఉచితంగా బస్సులో ప్రయాణించే సౌకర్యం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వైకల్యాన్ని బట్టి పింఛన్ మొత్తాన్ని పెంచిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. తాత్కాలిక వైకల్యం ఉన్నవారికి 6వేలు, శాశ్వత వైకల్యం ఉన్నవారికి 15వేల రూపాయలు వంతుల పింఛన్ ఇస్తున్న ఘనత చంద్రబాబు నాయుడు కి దక్కిందన్నారు. మొదటినుంచి దివ్యాంగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద మనసుతో ప్రేమాభిమానాలు చూపుతూనే ఉన్నారని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే వారికి ఉచితంగా ట్రై సైకిళ్లు, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సాహకాలను తమ ప్రభుత్వం అందిస్తోందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులకు త్వరలో ఇళ్లపట్టాలు అందిస్తామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. పేదల అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల మనసులు గెలుచుకున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. స్త్రీశక్తి పథకం మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉందని, రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్టీసీ బస్సు ప్రయాణమే సురక్షితమని, ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఎమ్మెల్యే కోరారు. నియోజవర్గంలో ఇప్పటివరకు 10 కోట్లకు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు పేదలకు అందించామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆర్. శ్రీనివాసులు, కంట్రోలర్ ఇన్స్పెక్టర్ ప్రసాదు, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, పార్టీ నేతలు రెబ్బవరపు మాల్యాద్రి, చుండూరి శ్రీను, రాయపాటి శ్రీను, పసుపులేటి రమణయ్య, ఆర్టీసీ యూనియన్ నాయకులు మహేష్, శివ, సుబ్బారావు, రాజు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యగులకు సమాజంలో మంచి గుర్తింపు తేవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### దివ్యాశీగ శక్తి పథకశీని ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 28**

గిద్దలూరు పట్టణంలోని ఎపి ఎస్ ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి "దివ్యంగా శక్తి" పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా దివ్యగులు ఆర్టీసీ బస్ లో ఉచితంగా ప్రయాణించగలరన్నారు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ముఖ్యంగా దివ్యగుల జీవితానికి వెలుగు నింపుతుందన్నారు, వారి రోజువారీ ప్రయాణ ఖర్చులను తగ్గించడంలో ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. ముందుగా ఆర్టీసీ యాజమాన్యం ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి సాదర స్వాగతం పలికారు,తరువాత" ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల చిత్ర పటానిలకు ఎమ్మెల్యే , దివ్యాశీగులు పాలాభిషేఖం చేశారు. అనంతరం ఎమ్మెల్యే దివ్యాంగులకి శాలువ, పూలమలాలతో ఘనంగా సన్మానించారు వారితో పాటు బస్ లో మాట, మంతి చేస్తూ కొంత దూరం ప్రయాణం చేశారు. ఈసందర్భగంగా దివ్యగులకు భోజనం వడ్డించి వారితో పాటు భోజనం చేస్తూ వారి కుటుంబ సభ్యుల వివరాలు ఆర్థికస్థితిగతులు, అడిగి తెలుసుకున్నారు మీ సమస్యలు సత్వరమే ప్రభుత్వం దృష్టికి తీసుకోని వెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానన్నారు. ఈ పథకం ద్వారా దివ్యగులకు సమాజం లో మంచి గుర్తింపు, వారి కుటుంబ ఆర్థిక స్తోమత ను మెరుగు పరుస్తున్నట్లుగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలు అందరికీ ఎంతో మేలు చేస్తుందని తెలిపారు ఈ పథకం అమలు వివరాలు, నిబంధనలు ఎమ్మెల్యే స్వయంగా వారికి వివరించారు. అలాగే, ఈ పథకం ద్వారా దివ్యగులు బస్సు ప్రయాణంలో మరింత సౌకర్యవంతమైన అనుభవాన్ని పొందుతారని, భవిష్యత్ లో మరిన్ని సామాజిక సంక్షేమ కార్యక్రమాలను అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రారంభోత్సవంలో ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు, సమాజ సేవకులు, స్థానిక నాయకులు , కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలతో సమన్వయంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.

# విజయవంతంగా వైయస్ షర్మిల రెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర



**దర్శి మార్చి 18 పెన్ పవర్ :**

రాష్ట్ర అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల చైర్మన్ దర్శి నియోజకవర్గ సమన్వయకర్త కైపు వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత నెల ఫిబ్రవరి రెండో తారీఖు అనంతపురం జిల్లా బండ్లపల్లి నుంచి ప్రారంభమైన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ రాష్ట్ర పరిరక్షణ యాత్ర బుధవారం విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలో పూర్తి చేయడం జరిగినది. ఈ పరిరక్షణ యాత్రలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఉపాధి హామీ కూలీలు రైతులు కార్మికులు విద్యార్థులు యువకులు మహిళలు తమ తమ సమస్యలు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా షర్మిల రెడ్డి కూడా వెంటనే అక్కడ స్పందించి జిల్లా కలెక్టర్ తోలు మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యేల మరి ఎంపీలతో సమస్యలను పరిష్కారం చూసే విధంగా ముందుకు సాగుతూ వెళ్లారు. పరిరక్షణ యాత్ర ముగిసిన అనంతరం వైయస్సార్ ఎమ్మెల్యే రెడ్డితో డేటి అయిన రాష్ట్ర అసంఘటత కార్మికుల మరియు ఉద్యోగుల కాంగ్రెస్ పార్టీ చైర్మన్ దర్శి నియోజకవర్గం సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి కలవడం జరిగినది. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగస్వామ్యం అయినందుకు గాను కార్యక్రమాలు ముందుకు సాగడం లో కీలక పాత్ర పోషించినందుకు కైపు వెంకటకృష్ణారెడ్డిని ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీపై నిబద్ధత ఇదే క్రమశిక్షణతో ఇంకా ముందుకు వెళ్లాలని దర్శి నియోజకవర్గంలో శాసనసభ్యుడిగా గెలిచే విధంగా కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించాలని వెంకటకృష్ణారెడ్డిని కోరారు.

# ఉగాది – వసంత నవరాత్రుల మహిమాన్వితం



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 18**

తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఉగాది పండుగ నూతన సంవత్సరారంభాన్ని సూచించే పవిత్ర దినం. చంద్రసౌర కాలమానం ప్రకారం వచ్చే ఈ పండుగను తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ఘనంగా, ఆనందోత్సాహాలతో నిర్వహిస్తారు. ఉదయాన్నే లేచి స్నానాలు చేసి, ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి, తలుపులకు తోరణాలు కట్టి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. ఉగాది ప్రత్యేకతలో ప్రధానంగా నిలిచేది "ఉగాది పచ్చడి". చింతపండు, బెల్లం, మామిడి, వేపపూలు, మిర్చి, ఉప్పు వంటి రుచుల సమ్మేళనంగా ఉండే ఈ పచ్చడి జీవితం లోని ఆరు రకాల అనుభవాలకు ప్రతీకగా భావించబడుతుంది. కుటుంబ సభ్యులు కలిసి పూజలు నిర్వహించి, దేవాలయాలను సందర్శించి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. ఈ రోజున పండితుల వద్ద పంచాంగ శ్రవణం, రాశి-నక్షత్ర ఫలితాల వినడం కూడా ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సంవత్సరం "పరాభవ నామ సంవత్సరం"గా ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ప్రతికూల ప్రభావాలను తగ్గించుకోవడానికి భగవంతుని నామస్మరణ చేయాలని పెద్దలు సూచిస్తున్నారు. ఉగాది నుండి శ్రీరామనవమి వరకు కొనసాగే వసంత నవరాత్రు కూడా ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యతను కలిగింది ఈ సంవత్సరం ఫరాభవ నామ సంవత్సరం గా ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతికూల ప్రభావాలను తగ్గించుకోవడానికి భగవంతుని నామ స్మరణ చేయాలని పెద్దలు సూచిస్తున్నారు ఉగాది నుండి శ్రీరాముని వరకు కొనసాగే వసంత నవరాత్రులు కూడా ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి ఈ నవరాత్రులలో లలితాదేవిని వివిధ రూపాలలో ఆరాధించడం శ్రీరామచంద్రుని నామస్మరణ చేయడం ప్రత్యేకంగా కనిపించే ఆచారాలు అందుకే ఈ తొమ్మిది రోజులు రాములవారి నవరాత్రులుగా కూడా పిలుస్తారు భక్తులు ఈ కాలంలో ఉపవాసాలు పూజలు జపాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకుంటారు మొత్తానికి ఉగాది పండుగ కొత్త ఆశలు సంకల్పాలు నింపుతూ జీవితానికి ఒక కొత్త దశను చూపిస్తుంది వసంత నవరాత్రులు భక్తి ఆత్మ పరిశీలనకు మార్గదర్శకంగా నిలుస్తూ మన తెలుగు సంస్కృతికి మరింత గొప్పతనాన్ని చాటుతున్నాయి.

# గ్రామాల వెలుపల గ్యాస్ సిలిండర్ల పంపిణీపట్ల వినియోగదారుల ఆందోళన





**కొమరోలు పెన్ పవర్ మార్చి 18**

గ్యాస్ సిలిండర్ల కొరత సంక్షోభం కొమరోలు మండలంలో రోజురోజుకు పెరిగిపోతుంది. వినియోగదారులకు సక్రమంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం జరిగేందుకు సంబంధిత మండల స్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోగా, గ్యాస్ సిలిండర్ల అక్రమ పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకోకపోవడం వెనుక గల ఆంతర్యం ఏమిటని పలువురు వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. కొమరోలు మండలంలో దాదాపు పదివేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. దాదాపు తొమ్మిది వేలకు పైగా కనెక్షన్లు గిద్దలూరు చెందిన రెండు గ్యాస్ ఏజెన్సీల పరిధిలో ఉన్నాయి ఆ మేరకు వారు సిలిండర్లను సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజు నాలుగైదు ఆటోలు నిండు గ్యాస్ సిలిండర్ల లోడుతో కొమరోలు పట్టణంతో పాటు పరిసర గ్రామాలలో పర్యటిస్తూ అవసర మున్నవారికి ఇంటింటికి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసేవారు. దీనితో కొమరోలు మండలంలోని వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల కొరత ఉండేది కాదు. అయితే ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా యుద్ధం ప్రకటించడంతో భారతదేశానికి గ్యాస్ సరఫరా కొరత ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకుని గ్యాస్ ఏజెన్సీల వద్ద సమృద్ధిగా గ్యాస్ సిలిండర్ల నిలువలు ఉన్నప్పటికీ కృత్రిమ కొరతను సృష్టిస్తూ అక్రమ మార్గంలో అధిక ధరలకు గ్యాస్ సిలిండర్లను విక్రయించుకుంటున్నారని స్థానిక గ్యాస్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిద్దలూరు గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించిన ఆటోలు గత నాలుగైదు రోజులుగా కొమరోలు మండలానికి వస్తున్నాయి. అయితే గతంలో వలే ఆటోలు కొమరోలు పట్టణంలో, గ్రామాలలోని వీధులలో పర్యటించడం లేదు. కేవలం గ్రామాల వెలుపల ఆటోలను ఆపి అక్కడికి వచ్చే వినియోగదారులకు అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. దీనితో గృహ వినియోగదారులు తమ ఖాళీ సిలిండర్లను ఇంటి బయట పెట్టుకొని పగలంతా ఆటోల కోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతున్నారు. ఆటోలు గ్రామ వెలుపల నిలిపి ఉన్నారనే సమాచారం తెలుసుకున్న కొందరు ద్విచక్ర వాహనాలపై ఖాళీ సిలిండర్లు పెట్టుకుని ఆటోల వద్దకు వెళ్లి సిలిండర్లు తెచ్చుకుంటున్నారు. మహిళలు ,వృద్ధులు, వికలాంగులు గ్రామాల వెలుపలకు వెళ్లలేక, ఆటోలు ఇళ్ల వద్దకు రాక ,సిలిండర్ లభించక పోవటంతో తీవ్ర ఇబ్బందులకు, ఆవేదనకు గురవుతున్నారు. గత మూడు రోజుల క్రితం ప్రారంభంలో రెండు ఆటోలు కొమరోలు పట్టణంలోని వీధి వీధిలో తిరిగి ఆన్లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. అయినప్పటికీ గ్యాస్ సిలిండర్ల కొరత తీరకపోగా, సిలిండర్ల కొరత తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నది. కొమరోలు పట్టణంతోపాటు గ్రామాలలోని గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ, గ్యాస్ ఏజెన్సీలు తమ ఆటోలను గ్రామాల వెలుపల నిలిపి అక్కడే వ్యాపారాలు సాగిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నప్పటికీ సంబంధిత మండల స్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం వెనుకల ఆంతర్యం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. తను ఫిర్యాదు చేసిన పట్టించుకునే వారే కరరవయ్యారని వారు వాపోతున్నారు. ఒకవైపు మార్కాపురం జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల కొరతలేదని, అవసరమైన వినియోగదారులందరికీ సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ,కృత్రిమ కొరత సృష్టించే ఏజెన్సీలపై, అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రకటనలు జారీ చేస్తున్నప్పటికీ, మండల స్థాయి అధికారులు అందుకు అనుగుణంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండలంలోని గ్యాస్ వినియోగదారులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల వెలుపల ఆటోలను ఆపి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న గ్యాస్ సిలిండర్ ఏజెన్సీ కు సంబంధించిన ఆటోవాలాలను సంప్రదించగా ఆన్లైన్లో బుక్ చేసుకున్న వినియోగదారులందరికీ గ్యాస్ సిలిండలను పంపిణీ చేసేందుకు తాము ఒకొక్క ఆటోలో 60 సిలిండర్లను నింపుకొని గిద్దలూరు నుంచి బయలుదేరి వస్తున్నామని, అయితే మార్గమధ్యంలో గ్రామాల లోని వినియోగదారులు ఎక్కడికక్కడ తమ ఆటోలు నిలిపివేసి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాలని తమపై ఒత్తిడి చేస్తున్నారని, దీనితో ఆటోలు ముందుకు కదలలేని స్థితిలో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయవలసి వస్తున్నదని వారు చెబుతున్నారు. కావున జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుని కొమరోలు మండలంలోని తమకు గ్యాస్ సిలిండర్ సక్రమంగా పంపిణీ జరిగేందుకు వీలుగా మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని మండలంలోని గ్యాస్ వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

*బుర్రా మధుసూదన్ యాదవ్*

**కందుకూరు పెన్ పవర్ మార్చి 18**



తెలుగువారి సాంప్రదాయ నూతన సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలను కందుకూరు నియోజకవర్గ ప్రజలకు మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. పరాభవ నామ సంవత్సరాదిగా ఉగాది అరుదెంచుచున్నదని ఈ ఉగాది అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని షడ్రుషులైన తీపి చేదు వగరు పులుపు కారం లాంటి రుచులతో జీవితం నిండాలని ఆకాంక్షించారు. ఉగాది నాడు పంచాంగ శ్రవణం ద్వారా రాబోయే సంవత్సరములో రాశి ఫలాలు వర్షాభావ పరిస్థితులు గ్రహ స్థితులు రాజకీయ పరిణామాలపై జ్యోతిష్యులు వివరించు శ్రవణం అందరి జీవితాల్లో ఆనందం నింపాలని అభిలషించారు. పకృతి వసంత రుతువు రాకతో లేత చివుళ్ళను సంతరించుకొని కోకిల కూహు కుహు రాగాలతో నూతన ఉత్తేజానికి స్వాగతం పలుకుతుంది. ఉగాది పండుగ సకల ప్రాణకోటికి నూతన శక్తిని ఆశలను కొత్త చిగురు లాంటి ఆనందాన్ని ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు

**-ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు**

**కందుకూరు పెన్ పవర్ మార్చి 18**



శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను ప్రజలు అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీ, వైకాపా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు తూమాటి మాధవ రావు కోరారు. వైకాపా అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి, ప్రజలకు, వైకాపా నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

**-మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి**

**కందుకూరు పెన్ పవర్ మార్చి 18**



శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా కందుకూరు నియోజకవర్గ ప్రజలకు, అభిమానులకు మాజీమంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఈ పర్వదినం ప్రతి ఇంట సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి మన జీవన విధానాన్ని సజీవంగా ఉంచుతాయన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలకు ఆ భగవంతుడు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని, దేవుడి దీవెనలతో అన్ని విషయాల్లో విజయం సిద్ధించాలని మహీధర్ రెడ్డి ఆకాంక్షించారు.

# దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

**టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు**




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 18**

దివ్యాంగుల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన దివ్యంగా శక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా దివ్యాంగులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతు పరిస్థితుల కారణంగా దివ్యంగులుగా మారిన వారి కోసం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం అభినందనీయమని అన్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్లు పెంచిందని, అందరితో సమానంగా అన్ని సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. అనంతరం దివ్యాంగులతో కలిసి యర్రగొండపాలెం నుండి త్రిపురాంతకం వరకు బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఈ పథకం ద్వారా చేకూరే లబ్దిని దివ్యాంగులు ఎరిక్షన్ బాబు పంచుకున్నారు. ఎరిక్షన్ బాబు శ్రీ బాల త్రిపురసుందరి దేవి అమ్మవారి ఆలయంలో దివ్యాంగులతో కలిసి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కందుకూరులో షాదిఖానా ఏర్పాటు చేస్తా

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు - ఇంటూరి చేతులమీదుగా రంజాన్ తోఫా పంపిణీ**

**-అర్హులైన ముస్లింలందరికీ త్వరలో ఇళ్లస్థలాలు అందిస్తాం -కూటమి ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధికి ప్రాధాన్యత**

**కందుకూరు పెన్ పవర్ మార్చి 18**

పట్టణంలోని పేదలకు త్వరలో ఇళ్లస్థలాలు అందిస్తామని, పేద ముస్లిం కుటుంబాలకు అందులో మొదటిప్రాధాన్యత ఉంటుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా, పట్టణంలోని 150 మంది పేద ముస్లింలకు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా బుధవారం రంజాన్ తోఫా అందించారు. మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ సలాం సొంత ఖర్చుతో సరుకులు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ముస్లిం కుటుంబాలలో చాలామందికి సొంతగా ఇళ్లులేవని, కనీసం స్థలాలు లేని వారు చాలామంది ఉన్నారని నాగేశ్వరరావు అన్నారు. అలాంటి వారందరికీ త్వరలో తప్పక సహాయం అందుతుందని చెప్పారు. పట్టణంలో షాదీ ఖానా భవనాన్ని తప్పక నిర్మిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇమామ్, మౌజంలకు ముఖ్యమంత్రి చంద్రబాబు 90 కోట్లు విడుదల చేశారని, తాజాగా మరో 45 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ముస్లింల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. డబ్బు ఎంతోమంది దగ్గర ఉన్నప్పటికీ సేవ చేయాలన్న ఆలోచన, దానగుణం కొద్దిమందిలో మాత్రమే ఉంటుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ప్రతిఒక్కరూ రంజాన్ పండుగ జరుపుకోవాలన్న మంచి ఆలోచనతో, పేదలకు తోఫా అందిస్తున్న సలాంను అల్లాహ్ చల్లగా చూడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లింలందరికీ ఆయన ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మత పెద్దలు రియాజ్ మౌలానా, ఫైరోజ్ మౌలానా, ముజీబ్ మౌలానా, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, సలాం, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, జియావుద్దీన్, ఫిరోజ్, ఖలీల్, బాషా, వలీ, వడ్డేళ్ల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.






# నవోదయలో సిద్ధార్థ విద్యార్థుల జయఢంకా...

**ముగ్గురు విద్యార్థులు ఎంపిక - పాఠశాల ప్రతిష్టను పెంచిన ప్రతిభ**




**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 18**

పుల్లలచెరువు మండలం ముటుకులలోని సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షల్లో మెరిసి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు. 2026--27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ముద్ద అవినాష్, ఎం. మాధవి, టి. సంతోష్ రెడ్డి ఎంపికై తమ ప్రతిభను చాటుకున్నారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో ఈ ముగ్గురు విద్యార్థులు ప్రవేశానికి అర్హత సాధించడం పాఠశాలలో ఆనందోత్సాహాలను నింపింది. డిసెంబర్‌లో జరిగిన ఈ ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో కృషి చేసి మంచి మార్కులు సాధించి విజయాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మానుకొండ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల అంకితభావం కలిసి వచ్చిన ఫలితమే ఇది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం ఉంటే పెద్ద విజయాలు సాధించగలరని మా విద్యార్థులు నిరూపించారు అని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నవోదయ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ప్రవేశం సాధించడం ద్వారా ఈ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# శ్రీ సంస్కృతి స్కూల్లో ఘనంగా ఉగాది, రంజాన్ వేడుకలు






**కందుకూరు పెన్ పవర్ మార్చి 18**

పట్టణం లోని శ్రీ సంస్కృతి స్కూల్లో బుధవారం నాడు ఉగాది, రంజాన్ ముందస్తు వేడుకలను భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెబుతూ, విద్యార్థులలో నైతిక విలువలు, పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల ప్రాంగణంలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ షడ్రుచుల కలయికైన ఉగాది పచ్చడిని తయారుచేసి, దాని విశిష్టతను సోషల్ టీచర్ నరసింహ రావు వివరించిన అనంతరం పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా విద్యార్థులు రంజాన్ పండుగ ప్రాముఖ్యతను, ఉపవాస దీక్షల విశిష్టతను నాటికల రూపంలో ప్రదర్శించి విద్యార్థులందరికీ "షీర్ ఖుర్మా" ను పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొంకా చంద్రశేఖర్ మాట్లాడుతూ మన స్కూలు ఒక చిన్న ప్రపంచం. ఇక్కడ ఉగాది పచ్చడిలోని తీపి ఉంది, రంజాన్ ఖీర్ లోని కమ్మదనం ఉంది. ఈ రెండింటి కలయికే మన భారతీయ సంస్కృతి,మతాలు వేరైనా మనం నేర్చుకోవలసినది ఒక్కటే ప్రేమ కరుణ గౌరవం. అంతేగాక కలిసి ఉండటం ఒక ఆరంభం, కలిసి పనిచేయడం ఒక పురోగతి, కలిసి పండుగలు జరుపుకోవడం ఒక గొప్ప సంస్కృతి అని తెలియజేసి చివరగా విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిన్సిపాల్ హరి,వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సత్యనారాయణ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించిన బుర్రా

**కందుకూరు పెన్ పవర్ మార్చి 18:**



అక్రమ కేసులో అరెస్టు అయ్యి నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ని అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడం దుర్మార్గమైన చర్య అని,కూటమిపాలనలో ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేస్తున్నారని, సత్యనారాయణ రెడ్డి అక్రమ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక మట్టి దందాలను జిల్లాలో ప్రశ్నిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మీద కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. కూటమి నాయకుల అవినీతి, అక్రమాలను, ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు, తప్పుడు సెక్షన్ లు ఎలా పెట్టాలో ఏ విధంగా ఫిర్యాదు చేయాలో పైనుండే డైరెక్షన్ ఇస్తున్నారని విమర్శించారు. టిడిపి నేతలు ,కూటమి నాయకులు చేస్తున్న ఆకృత్యాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. బాధ్యత కలిగిన ఎంపీ స్థానంలో ఉండి మార్గదర్శిగా ఉండవలసిన మహేష్ యాదవ్ డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డితే మహేష్ యాదవ్ మీద చర్యలు తీసుకోకుండా షోకాజ్ నోటీసులు ఇచ్చి, సస్పెండ్ చేస్తున్నట్టు చేతులు దులుపుకుంటున్నారు కూటమి నాయకులు అని ధ్వజమెత్తారు. సత్య నారాయణ రెడ్డి మీద జరిగిన దాడి, ఆయన మీద నమోదు చేసిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయనపై బనాయించిన కేసులను కూడా బేషరత్తుగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాము అని బుర్రా అన్నారు.

# అబ్దుల్ అజీజ్ ని పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు పెన్ పవర్ మార్చి 18:**

నెల్లూరు పార్లమెంట్ టీడీపీ మాజీ అధ్యక్షులు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తల్లి ఇటీవల మరణించారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం నెల్లూరులోని అబ్దుల్ అజీజ్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. టిడిపి నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, రాష్ట్ర ముస్లిం మైనార్టీ అధికార ప్రతినిధి షేక్ రఫీ, కందుకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు షేక్ మున్నా, 7వ వార్డు అధ్యక్షుడు షేక్ గౌస్ బాషా తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**-ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్**

**కందుకూరు పెన్ పవర్ మార్చి 18:**



రాష్ట్ర ప్రజలకు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ చౌదరి పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతన తెలుగు సంవత్సరం ప్రజల కుటుంబాల్లో ఆర్థిక, ఆరోగ్య, సంతోషాలను నిలపాలని కోరుకుంటున్నట్లు శ్రీకాంత్ తెలిపారు. పరాభవ అంటే మనలోని అహంకారాన్ని, చెడు ఆలోచనలను ఓడించి విజయానికి పునాది వేసేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

# దివ్యాంగులతో కలిసి శక్తి పథకాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ పులి

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 18**

రాష్ట్రంలో దివ్యాంగుల శక్తి పథకం ప్రారంభమైంది. ఈ పథకంలో భాగంగా 40% పైన ఉన్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ డిఎం ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం పట్టణ తెలుగుదేశం నాయకులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా 45% పైబడిన దివ్యాంగులకు పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులలో 100% రాయితీతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. సూపర్ లగ్జరీ బస్సులలో దివ్యాంగులు 50% రాయితీతో ప్రయాణం చేయవచ్చు. దీనికి సదరం సర్టిఫికెట్ లేక దివ్యాంగుల గుర్తింపు పత్రం తప్పనిసరిగా దివ్యాంగులు తమతో తీసుకువచ్చి బస్సుల్లో ప్రయాణించవచ్చు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో దివ్యాంగులకు భోజనం ఏర్పాటు చేశారు.



# స్థల వివాదంలో తండ్రి కొడుకులపై దాడి

## -పోలీస్ లకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని బాధితుల ఆరోపణ






**కందుకూరు పెన్ పవర్ మార్చి 18:**

స్థల వివాదంలో గాయాలపాలై పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు గుడ్లూరు మండలం మోచర్ల గ్రామానికి చెందిన తలకాయల ప్రభాకర్ రావు తెలిపిన వివరాల ప్రకారం తనకి సంబంధించిన స్థలంలో అతని అన్న అయినా తలకాయల చిన్న కోటయ్య అక్రమంగా పైపులైన్లు వేస్తున్నారని ఇదేమిటి అని అడిగితే గొడవలకు దిగి అక్కడే ఉన్న గొడ్డలితో తన తలపై కొట్టి గాయపరిచారని తెలిపారు. దాంతో మంగళవారం కందుకూరులోని ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం రావడం జరిగిందన్నారు. తనపై దాడి చేయడమే కాకుండా తలకాయల చిన్న కోటయ్య కుమారులు తలకాయల చంద్రశేఖర్, శ్రీకాంతలు బుధవారం తెట్టు వద్ద ఉన్న మా షాపులో నా భార్య చిన్న కుమారుడు ఉన్న సమయంలో అక్కడికి వెళ్లి షాపులు ధ్వంసం చేసి నా చిన్న కుమారుడిని కర్రతో తల పగలగొట్టారని మా కుటుంబ సభ్యులకి మొత్తం వారి వల్ల ప్రాణహాని ఉందని ఆయన తెలిపారు. గాయపడిన నా కుమారుడిని కందుకూరు ఏరియా వైద్యశాలకు తీసుకురావడం జరిగిందని వైద్యులు మెరుగైన వైద్య కోసం ఒంగోలు కి వెళ్లాలని చెబుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థల వివాదం విషయంపై ఆదివారం గుడ్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని అయితే వారు పట్టించుకోకపోవడంతో మంగళవారం మాపై గొడవలు పెట్టుకొని నన్ను గాయపరిచారని దాంతోపాటు నా చిన్న కుమారుడు సైతం చంపే ప్రయత్నం చేశారని పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే మాకు ఈ పరిస్థితి ఉండేది కాదని ఆయన ఆరోపించారు. సామాన్య ప్రజలకి రక్షణ కల్పించాల్సిన పోలీసుల నిర్లక్ష్యం వలనే మేము హాస్పిటల్ లో ఉన్నామని ఇప్పటికైనా వారి నుండి మాపై జరిగిన దాడిని దృష్టిలో పెట్టుకొని మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నామన్నారు.

# బి.ఆర్ ఆక్స్ఫర్డ్ పాఠశాలలో వైభవంగా ఉగాది వేడుకలు




**కందుకూరు పెన్ పవర్ మార్చి 18**

పట్టణ పరిధిలోని పామూరు రోడ్డు నందు ఉన్న బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ పాఠశాల నందు ముందస్తు ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బాల, బాలికలు సాంప్రదాయ వస్త్రాలను ధరించి భక్తి శ్రద్ధలతో లక్ష్మి పూజ చేసి ప్రసాదాలు,ఉగాది పచ్చడి పంచిపెట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బి.ఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ ఉగాది తెలుగువారి నూతన సంవత్సరం అని షడ్రుచులు ఉగాది పచ్చడిలాగా మన జీవితం ఉంటుందన్నారు. జీవిత గమనంలో కష్ట సుఖాలను అనుభవిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ జి.బాల భాస్కర రావు మాట్లాడుతూ విద్యార్థులందరూ కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటిని నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు. అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి. నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెట్టుపై నుండి జారిపడి వ్యక్తి మృతి

### మృతదేహాన్ని పరిశీలించిన ఎస్సై వెంకటేశ్వర నాయక్



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 18**

చింతకాయలు కోస్తూ ప్రమాదవశాత్తు చింత చెట్టు పైనుండి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వి బైలు గ్రామంలో జరిగింది పోలీసుల వివరాలు ప్రకారం సిఎస్పురం మండలం వి బైలు గ్రామానికి చెందిన జమకాల నడిపి ఓబయ్య 67 సంవత్సరాలు అనే వ్యక్తి మంగళవారం మధ్యాహ్న సమయంలో గ్రామానికి సమీపంలోని చింత చెట్టు పైకి ఎక్కి చింతకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి క్రింద పడిపోయాడు తీవ్రమైన గాయాలు కావడంతో ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలకు తరలించారు చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు ఎస్సై వెంకటేశ్వర నాయక్ మృతదేహాన్ని పరిశీలించారు అనంతరం రిమ్స్ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు మృతునికి భార్య ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ ప్రధాన పరీక్షలు

**గిద్దలూరు, పెన్ పవర్ మార్చి18**

గత నెల 23 నుంచి జరుగుతున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రధాన పరీక్షలు బుధవారం జరిగిన రసాయన శాస్త్రం- 2 తో ముగిశాయి. గిద్దలూరు పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాల్లో ఎంపిక సబ్జెక్టు విభాగంలోని భౌగోళిక శాస్త్రం (జియోగ్రఫి) - 1 మినహా మిగిలిన అన్ని పరీక్షలు పూర్తయ్యాయి.పరీక్షలన్నీ ప్రశాంతంగా, సజావుగా సాగాయి.పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించడంలో, వసతుల కల్పనలో పరీక్ష నిర్వహణాధికారులు, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంలో పోలీసు అధికారులు సఫలీకృతులయ్యారు. కస్టోడియన్ గా వి. పూర్ణ చంద్రుడు (జి.జె.సి -తురిమెళ్ళ) పరీక్షల చీఫ్ సుపురింటెండెంట్లుగా ఎం. మురళీకృష్ణ (ప్రిన్సిపాల్-ఎస్వీ జూనియర్ కళాశాల, గిద్దలూరు) ఎ. అల్లూరయ్య (జిజెసి-కొమరోలు)ఆర్. శిరీష కుమారి (జిజెసి-కంభం) డిపార్టుమెంటల్ అధికారులుగా ఎస్. కృష్ణయ్య (జిజెసి-కంభం) జె. పోలురాజు (జిజెసి-అర్ధవీడు),ఎం. సతీష్ రెడ్డి (జిజెసి-తురిమెళ్ళ) వ్యవరించగా, గిద్దలూరు అర్బన్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పకడ్బందీ బందోబస్తు చేపట్టారు.

**20వ రోజు 22మంది గైర్హాజరు:** ఇంటర్ పరీక్షల్లో 20వరోజు బుధవారంనాడు నిర్వహించిన కెమిస్ట్రీ-2 పరీక్షకు పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 22 మంది గైర్హాజరయ్యారు. 494 మందికి గానూ 472మంది హాజరయ్యారు. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 96మందికి 94మంది హాజరయ్యారు. శ్రీజీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 236 మందికి 228మంది హాజరు కాగా,సాహితి జూనియర్ కళాశాలలో 162మందికి 150మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు, స్క్వాడ్ మెంబర్ గల్లా ప్రభాకర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

# పదో తరగతి పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ జేబులను చెక్ చేసిన మండల స్థాయి అధికారి??

**కొమరోలు పెన్ పవర్ మార్చి 18**

పబ్లిక్ పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాలను సందర్శించే అధికారులు పరీక్ష గదులలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను చెక్ చేయటం వారికి సూచనలు సలహాలు ఇవ్వడం హెచ్చరికలు చేయటం సర్వసాధారణంగా జరుగుతూ ఉంటుంది. అయితే కొమరోలు లోని ఒక పరీక్ష కేంద్రాన్ని సందర్శించేందుకు వెళ్లిన ఒక మండల స్థాయి అధికారి పరీక్షా గదిలోనికి వెళ్లి విద్యార్థులను తనిఖీ చేయకుండా ఆ గదిలో పర్యవేక్షిస్తున్న ఇన్విజిలేటర్ జేబులను అతని ఆప్టికల్స్ పౌచ్ ను తనిఖీ చేసి విమర్శల పాలైన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా కొమరోలు మండలంలోని పలు పాఠశాలల్లో 10వ తరగతికి చదువుతున్న విద్యార్థుల కొరకు కొమరోలు లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 16వ తేదీ సోమవారం తెలుగు పరీక్ష నిర్వహించారు. సదరు పరీక్షకు నూరు శాతం మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు ప్రకటించారు. రెండు పరీక్ష కేంద్రాలను పలువురు మండల స్థాయి అధికారులు సందర్శించారు. కాగా కొమరోలు లోని ఒక పరీక్షా కేంద్రంలో జరిగిన ఆసక్తికరమైన ఓ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆ పరీక్షా కేంద్రాన్ని సందర్శించే నిమిత్తం ఒక మండల స్థాయి అధికారి వెళ్లి పరీక్ష గదుల లోనికి వెళ్లి తనిఖీలు చేశారు. అయితే సదరు అధికారి ఒక పరీక్ష గదిలోనికి వెళ్లి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బదులుగా ఆ పరీక్షా గదిలో ఇన్విజిలేషన్ విధులలో ఉన్న ఇన్విజిలేటర్ జేబులను, అతని కళ్ళజోడు పౌచ్ ను క్షుణ్ణంగా తనిఖీ చేసి పలువురి విమర్శలకు గురయ్యారని తెలిసింది. సాధారణంగా పరీక్షలు రాసేందుకు పరీక్షా కేంద్రానికి వచ్చే విద్యార్థులను పరీక్ష కేంద్రం ప్రధాన ద్వారం వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపిస్తారు. పరీక్ష గదిలోనికి వెళ్ళిన తర్వాత ఇన్విజిలేటర్ విద్యార్థులకు ముందస్తుగా పలు సూచనలు సలహాలు ఇస్తూ హెచ్చరికలు జారీ చేస్తారు. పరీక్షలలో అక్రమాలకు పాల్పడవద్దని అలాంటివారు పట్టుబడితే డిబార్ అవుతారని, భవిష్యత్తు చదువుకు ఆటంకం కలుగుతుందని హెచ్చరిస్తూ ఏవైనా చిట్టీలు, కాపీలు ఉంటే ఇప్పుడే బయటపడేయండి. లేకుంటే ఇబ్బందులు పడతారని. తనకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని, తనతోపాటు మండల స్థాయి అధికారులు, స్క్వాడ్ అధికారులు కూడా తనిఖీలు చేస్తారు అంటూ హెచ్చరించడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది .ఆ విధంగా విద్యార్థులను హెచ్చరిస్తూ సక్రమ మార్గంలో పరీక్షలు జరిగేందుకు ఇన్విజిలేటర్లు కృషి చేస్తారు. అయితే ఒక పరీక్ష గదిలోనికి వెళ్లిన మండల స్థాయి అధికారులు ఒకరు విద్యార్థులను తనిఖీ చేయటం లేదా, వారికి సూచనలు సలహాలు ,హెచ్చరికలు, చేయకుండా ఏకంగా ఆ పరీక్షా గదిలో ఇన్విటేషన్ డ్యూటీలో ఉన్న ఇన్విజిలేటర్ వద్దకు వెళ్లి అతని షర్టు, ప్యాంట్ జోబులను క్షుణ్ణంగా తనిఖీ చేశారని తెలిసింది. అంతటితో ఆగకుండా ఆ ఇన్విజిలేటర్ వద్ద



ఉన్న కళ్ళజోడు పౌచ్ ను కూడా తెరిచి నిశితంగా పరిశీలించారని తెలిసింది. ఈ సంఘటన చూస్తున్న విద్యార్థులు తాము రాస్తున్న పరీక్షను పక్కనపెట్టి ఈ ఆసక్తికర సంఘటనను నవ్వుతూ తిలకించడం జరిగిందని తెలిసింది. ఆవేదనకు, అవమానానికి గురి అయిన ఆ ఇన్విజిలేటర్ ఇలా చేయడం ఎంతవరకు సబబని, విద్యార్థుల ముందు తనను అవమానించడం ఇదెక్కడి న్యాయమని అధికారిని ఆవేదనతో ప్రశ్నించినట్లుగా తెలిసింది. నేను మండల స్థాయి అధికారిని .నాకు సర్వహక్కులు ఉన్నాయి .నేను ఎవరినైనా తనిఖీ చేస్తాను అంటూ అధికారి మాట్లాడి సదరు ఇన్విజిలేటర్ను మరింత ఆవేదనకు అవమానానికి గురి చేసినట్లుగా తెలిసింది. దీనితో సదరు అధికారిని ఎదిరించలేక విద్యార్థుల ముందు అవమాన భారంతో తలవంచుకొని విధులు నిర్వహించవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిసింది. పరీక్ష గదిలో నుంచి వస్తున్న మాటల ధ్వని ని గమనించిన ఆ పరీక్షా కేంద్ర నిర్వాహకులు ఆ పరీక్ష గదిలోనికి వెళ్లి ఇద్దరికీ నచ్చజెప్పి మండల స్థాయి అధికారిని అక్కడి నుంచి బయటకు పంపించారని తెలిసింది. పట్టుబడిన శత్రు దేశ సైనికున్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన విధంగా పరీక్ష గదిలో విద్యార్థుల ముందు ఒక ఇన్విజిలేటర్ను తనిఖీ చేసి అవమానించటం ఎంతవరకు సమంజసం అని అంటూ రెండు పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, పలువురు ఇన్విజిలేటర్లు ఆవేదన చెందుతూ సదరు మండల స్థాయి అధికారి ప్రవర్తన పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారని తెలిసింది. పరీక్ష గదిలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్ను ఒక మండల స్థాయి అధికారి చెక్ చేయడం తమ సర్వీస్ లో ఎప్పుడూ చూడలేదని పలు ఉపాధ్యాయులు వ్యాఖ్యానించారు.పరీక్ష గదిలో జరిగిన సంఘటనను ఆసక్తికరంగా చూసిన విద్యార్థులు బయటకు వచ్చి తమ తల్లిదండ్రులకు, స్నేహితులకు చెప్పటంతో మండల స్థాయి అధికారి చేసిన నిర్వాకం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటన విన్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ముక్కున వేలేసుకున్నట్లుగా తెలిసింది.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు అబ్బూరి బాల నరసింహులు మృతి

**కొమరోలు పెన్ పవర్ మార్చి 18**

కొమరోలు మండలం అక్క పల్లి గ్రామ సమీపంలో కడప అమరావతి జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయ్యవారిపల్లి చెందిన అబ్బూరి బాల నరసింహులు( 30)మృతి చెందిన విషాద సంఘటన జరిగింది. అందిన వివరాల మేరకు కొమరోలు మండలం అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన అబ్బూరి బాల నరసింహులు బుధవారం ఉదయం తన మోటార్ బైక్ పై తాటిచెర్ల మోటు వైపుకు వెళుతుండగా తాటిచెర్ల మోటు వైపు నుంచి కొమరోలు వైపుకు వస్తున్న గుర్తు తెలియని వాహనం బాల నరసింహులు మోటార్ బైక్ ను బలంగా అక్కపల్లి గ్రామ సమీపంలో ఢీకొన్నది.ఆ ప్రమాదంలో బాల నరసింహులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ప్రమాదంలో బాల నరసింహులు



నడుపుతున్న చక్ర వాహనం దెబ్బతిని రోడ్డు మార్జిన్ లో ఉన్న పొలాల్లోకి వెళ్లి పడింది. ప్రమాద సంఘటనను చూసిన స్థానికులు సమాచారాన్ని బాల నరసింహులు తల్లిదండ్రులకు బంధువులకు తెలియజేశారు. మృతుడు బాల నరసింహులు అవివాహితులు కాగా అతనికి తల్లి తండ్రి ఉన్నారు. బాల నరసింహులు ఆయన తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు గతంలో బాల నరసింహులు ఇల్లు అగ్ని ప్రమాదాన్ని గురికావడంతో అతని విద్యార్థతలకు సంబంధించిన సర్టిఫికెట్లన్నీ కాలి బూడిద అయ్యాయని అప్పట్లో బాల నరసింహులు తీవ్ర ఆవేదనకు గురి అయ్యాడు.కొమరోలు పోలీసులు కేసు నమోదు చేసి బాల నరసింహులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు

### -టిడిపి యువ నేత ఇంటూరి రాజేష్



**కందుకూరు పెన్ పవర్ మార్చి 18**

తెలుగు వారి తొలి పండుగ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కందుకూరు నియోజకవర్గ ప్రజలకు తెలుగుదేశం పార్టీ యువ నేత ఇంటూరి రాజేష్ శ్రీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు రాజేష్ ప్రత్యేకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ?షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని మనకు బోధిస్తుందని ఈ నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఇంటూరి రాజేష్ ఆకాంక్షించారు.పరాభవ నామ సంవత్సరంలో ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఇంటూరి రాజేష్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# శ్రీ పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు

## ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 18**



నూతన తెలుగు సంవత్సరం ప్రారంభానికి చిహ్నంగా జరుపుకొనే తెలుగువారి మొదటి పండుగ ఉగాది. నూతన తెలుగు సంవత్సరాది, చైత్రమాసం, పాడ్యమి తిథి, శుక్లపక్షం అన్నీ ఈ పండుగతోనే వస్తాయి. సృష్టి కర్త బ్రహ్మ దేవుడు ఈ రోజు నుంచే సృష్టిని ప్రారంభించినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి. జీవితంలో కష్ట నష్టాలు సంతోషాలు తప్పక ఉంటాయని అన్నిటినీ స్వీకరించాలనేదే ఉగాది పచ్చడి సందేశం. ఈ ఉగాది నియోజకవర్గ ప్రజలకు శ్రీ పరాభవ నామ సంవత్సరమంతా సుఖ సంతోషాలు అందించాలని కోరుకుంటున్నాము. ఈ శ్రీ పరాభవ నామ ఉగాది పండుగను పంచాంగ శ్రవణం తదితర సాంప్రదాయ కార్యక్రమాలతో మరియు మంచి క్రొత్త లక్ష్యాలతో సంతోషంగా జరుపుకోవాలని కోరుచూ నియోజకవర్గ ప్రజలందరికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థులు లక్ష్యశుద్ధితో ముందుకు సాగాలి

## ఘనంగా ఇందిరా కళాశాలలో వార్షికోత్సవం -ఆకట్టుకున్న సంస్కృతిక కార్యక్రమాలు

### ప్రజ్ఞ 2కే 26 పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేత

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 18**

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్‌కు అడుగు పడుతుందని మార్కాపురం డిప్యూటీ డిఇఓ ఎం. శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం యాన్యువల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.. కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వి హెచ్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెన్నా హనుమాన్ రెడ్డి , మార్కాపురం డిప్యూటీ డిఇఓ శ్రీనివాసులు, మార్కాపురం డిస్టిక్ మలేరియా ఆఫీసర్ డాక్టర్. రాహుల్ , విహెచ్ఆర్ విద్యా సంస్థల సెక్రెటరీ వెన్నా ఇందిరా ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ నైతిక విలువలు కలిగిన విద్యార్థులే రేపటి దేశ పౌరులని అన్నారు.నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యం సాధించాలని ఆకాంక్షించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత స్థితికి



ఎదగాలన్నారు.క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలన్నారు. విద్యార్థులు స్నేహ పూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. ఏ బ్రాంచిలో చేరినా మనసుపెట్టి చదివితే సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు.అనంతరం మూడు రోజులుగా జరిగిన ప్రజ్ఞ 2 కే26 ఉత్సవం లో సాంకేతిక, సంస్కృతిక, ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను



అందజేశారు. అనంతరం కళాశాల యాజమాన్యం ముఖ్యఅతిలకు జ్ఞాపికలను అందజేసి దుస్సాలువలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.సుబ్బన్న అకాడమిక్ డీన్ డాక్టర్. చంద్రలేఖ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ విజయ, ఫార్మసీ కళాశాల ఇన్చార్జి రజిని డిప్లమా ఇన్చార్జి మాధవి, వివిధ విభాగాల హెచ్.ఓ.డి లు అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుమల కొండపై ఆవు నెయ్యి దీపారాధన 108 రోజులు పొడిగింపు

### స్వామి సేవకుడు పత్తి రామమూర్తి



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 18**

మండలంలోని అయ్యలూరివారిపల్లి పంచాయితీ పరిధిలోని తిరుమల కొండపై వెలిసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి ఆలయంలో మాఘ మాసం రథసప్తమి నుండి 54 రోజులపాటు నిర్వహించే ఆవు నెయ్యి దీపారాధన కార్యక్రమంను భక్తుల విజ్ఞప్తి మేరకు, డాక్టర్ చలమయ్య నాయుడు మరియు గ్రామస్తుల సూచనలతో 54 రోజుల నుండి108 రోజులకు పొడిగించినట్లు స్వామివారి సేవకుడు పత్తి రామమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవు నెయ్యి దీపారాధన పవిత్ర కార్యక్రమాన్ని డాక్టర్ చలమయ్య నాయుడు మరియు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ భక్తుల సహకారంతో ఈ పుణ్యక్షేత్రంలో, ప్రతి రోజూ ఆవు నెయ్యి దీపారాధన కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు భక్తుల విజ్ఞప్తిని ప్రోత్సహించేందుకు, స్వామి వారి ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని 108 రోజులకు పొడిగించాం. ఆవు నెయ్యి దీపారాధన కొరకు భక్తులు తమ వంతు ఆవు నెయ్యి సమర్పించుకొనుటకు 9381194290 ఫోన్ నెంబర్ సంప్రదించాలని తెలిపారు ఈ దీపారాధన కార్యక్రమం భక్తుల మనోభిలాషను నెరవేర్చే విధంగా జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొంది విజయవంతం చేయాలని కోరారు.

## కనిగిరి నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే కదిరి

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 18**



కనిగిరి నియోజకవర్గ ప్రజలకు కనిగిరి మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్సీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు ఉగాది పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగతో తెలుగు సంవత్సరాది ప్రారంభమవుతుందని, ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, కొత్త విజయాలకు నాంది కావాలని, తెలుగు భాషా సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ కుటుంబ సమేతంగా ఆనందంగా పండుగను జరుపుకోవాలని,ప్రతి ఇంటా సిరి సంపదలు, ఆయురారోగ్యాలు, సంతోషాలతో పండుగ జరుపుకోవాలని కోరుకుంటూ ప్రజలందరికీ హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

## బెడుసు పల్లెలో రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ

**కొమరోలు పెన్ పవర్ మార్చ్ 18**

కొమరోలు మండలం సూరవారిపల్లె పంచాయతీలోని గడుసుపల్లి గ్రామంలో బుధవారం రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి కేంద్ర ప్రభుత్వం నిధులతో కలిపి 20,000 రూపాయలు రైతుల బ్యాంక్ ఖాదాలలో జమ చేస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ను వర్తింప చేస్తూ ఇటీవల రైతుల ఖాతాలలో నిధులు జమ చేసింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కరపత్రాలను ముద్రించింది. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు కొమరోలు మండలం సూరవారిపల్లి పంచాయతీలోని బెడుసు పల్లె గ్రామానికి చెందిన బూత్ కన్వీనర్ మాదాల పుల్లయ్య ఆధ్వర్యంలో రైతులకు బుధవారం రైతన్న మీకోసం కరపత్రాలను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలలో జమచేసిన నిధుల వివరాలను, రాష్ట్ర ప్రభుత్వ ఆశయాన్ని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి రైతాంగానికి అందిస్తున్న సేవలను పుల్లయ్య రైతులకు వివరించారు. ఆ కార్యక్రమంలో సూరి వారి పల్లె గ్రామ సచివాలయం వ్యవసాయ సహాయ సహాయకులు, ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు నిత్యవసర వస్తువులు,దుస్తులు పంపిణీ



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 18**

సేవే శ్వాసగా మాస్టర్ ఫౌండేషన్ ముందడుగు వేస్తోందని ఆ సంస్థ ప్రతినిధి, వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ తెలిపారు. ప్రతి ఏడాది రంజాన్ సందర్భంగా నిరుపేదలకు కుల మతాలకతీతంగా నిత్యవసర వస్తువులు దుస్తుల పంపిణీ చేసారు. ఈ ఏడాది కూడా అదే రీతిలో నిరుపేద ముస్లింలకు పేదలకు నిత్యవసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో మార్కాపురం పట్టణంలో కొంతమంది పేద మహిళలకు గుర్తించి వారికి కుట్టు మిషన్ లో శిక్షణ ఇప్పించి వారు ఆర్థికంగా నిలబడెందుకు కుట్టు మిషను ఉచితంగా పంపిణ్ణీ చేసి వారి జీవనోపాడికి ఆసరాగా నిలిచారు. ఈ సేవా కార్యక్రమాలను తమ మాస్టర్ ఫౌండేషన్ ద్వారా నిరంతరం కొనసాగిస్తుంటామని తమ ఊపిరి ఉన్నంతవరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతుంటాయని ఆయన తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా అల్లాహ్ తో వైసీపీ మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కూటమి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, వైయస్ జగన్ మరోసారి సీఎం అయితేనే రాష్ట్రంలోని పేదల భవిష్యత్తు బాగుపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మళ్లీ రావాలి జగన్ కావాలి వైసిపి పాలన అని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన వెల్లడించాడు. ప్రతి వైసీపీ కార్యకర్త మరింత కష్టపడి వైసిపి అధికారంలోకి వచ్చేలా వైయస్ జగన్ మరోమారు సీఎం అయ్యేలా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన కోరారు.

## గిద్దలూరు బాలికల వసతి గృహానికి ఇన్వర్టర్ ను బహుకరించిన సబ్ రిజిస్టర్ ఇసాక్

### రూ. 60 వేల విలువైన ఇన్వర్టర్ విరాళం -విద్యార్థినులకు పెన్నులు, స్వీట్ల పంపిణీ

### అధికారి హోదాలో ఉండి సామాజిక బాధ్యత చాటుకున్న ఇసాక్





**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 18**

పదవిలో ఉండి ప్రజలకు సేవ చేయడమే కాకుండా, సామాజిక బాధ్యతతో విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవవచ్చని గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్ పి. ఇసాక్ నిరూపించారు. గిద్దలూరు పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం-1 లో చదువుకుంటున్న విద్యార్థినులకు విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సహకారంతో బుధవారం సుమారు రూ. 60,000 విలువైన భారీ ఇన్వర్టర్ సెట్‌ను బహుకరించారు. వసతి గృహంలో విద్యుత్ కోతలు ఏర్పడటం వల్ల విద్యార్థినులు చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం ఇసాక్ దృష్టికి రాగా స్పందించిన ఆయన, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సహకారంతో ఇన్వర్టర్ కొనుగోలు చేసి వసతి గృహానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చదువులో వెనుకబడకూడదని, ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యుత్ సమస్యలు వారి ఏకాగ్రతను దెబ్బతీస్తాయని, అందుకే ఈ చిన్న సాయం చేయదలచామని తెలిపారు. అలాగే విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశించారు. అలాగే విద్యార్థినులందరికీ అవసరమైన పెన్నులను, మనోల్లాసం కోసం స్వీట్లను పంపిణీ చేశారు. ఒక ఉన్నత అధికారి తమ వసతి గృహానికి వచ్చి తమ కష్టాలను తీర్చడమే కాకుండా, తమతో కలిసి సమయాన్ని గడపడం పట్ల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. అధికారుల హోదాలో ఉండి కూడా విద్యార్థుల అవసరాలను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన సబ్ రిజిస్ట్రార్ కి, వారి కార్యాలయ సిబ్బందికి వసతి గృహ వార్డెన్ జయమ్మ , విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది ,విద్యార్థినులు పాల్గొన్నారు.

## పాఠశాలలు ఆకస్మిక తనిఖీ

# ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 18**

గిద్దలూరు పట్టణంలోని యాదవ బజారులో గల జడ్.పి. హై స్కూల్‌ను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు వంటి అంశాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకొని, మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని ప్రోత్సహించారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి భోజనం రుచి, రోజూ వారి మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు ప్రతీ తరగతి గదిలోకి వెళ్లి పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి అసౌకర్యాన్ని అడుగగా విద్యార్థులు తరగతి గదిలో ఎండలు ఎక్కువగా ఉన్నాయని ఫ్యాన్ లు లేక ఇబ్బంది గా ఉంది అని ఎమ్మెల్యే ను అడిగారు, వ తక్షణమే 10 ఫ్యాన్ లు స్వయంగా అమలు చేశారు . బిల్డింగ్ పనులు పూర్తి కాని వాటికి వివరాలు తెలుసుకొని వెంటనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పరిశీలించిన ఎంఈఓ జె ప్రసాదరావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 18**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రత్నం జూనియర్ కళాశాల లోని పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పదవ తరగతి హిందీ పబ్లిక్ పరీక్షలను మండల విద్యాశాఖాధికారి జె ప్రసాదరావు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో మొత్తం 246 మంది విద్యార్థులకు గాను మొత్తం హాజరైనట్లు అలాగే రత్నం జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో 106 మంది విద్యార్థులకు గాను 104 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు మొత్తం రెండు పరీక్ష కేంద్రాల్లో 352 మంది విద్యార్థులకు గాను 350 మంది పరీక్షలకు హాజరై పరీక్షలు రాసినట్లు తెలిపారు పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించామని అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా జరిగాయని అన్నారు.

## తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

### బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 18**



తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు, పార్టీ నేతలకు, కార్యకర్తలకు, హిందూ బంధువులందరికీ శ్రీ. పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, కొత్త విజయాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని వివిధ అనుభవాలకు ప్రతీకలని, ఆనందం, దుఃఖం, కోపం, భయం, ఆశ్చర్యం, విరక్తి అన్నీ సమానంగా స్వీకరించాల్సిన అవసరాన్ని ఈ పండుగ మనకు గుర్తు చేస్తుందని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని కోరుకుంటూ, సమాజంలో సౌహార్దం, శాంతి నెలకొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

**పొన్నలూరు, పెన్ పవర్ మార్చి 17**

మండలంలోని తిమ్మపాలెం, రావులకొల్లు గ్రామాలలో ఉన్న అంగన్వాడి కేంద్రంలో బుధవారం లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పించారు. అంగనవాడి టీచర్ లక్ష్మీ ప్రశాంతి మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని లింగ నిర్ధారణ పరీక్షలు చేసి చట్టాన్ని అతిక్రమించిన వారికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, 10000 జరిమానా, వైద్యులు లింగనిద్దారణ పరీక్షలు చేసినట్లయితే మూడు సంవత్సరాలు జైలు శిక్ష, 50,000 జరిమానా తో పాటు, వైద్య ధ్రువీకరణ పత్రం రద్దు చేస్తారని తెలిపారు, బాల్య వివాహాలు నిషేధ చట్టం ప్రకారం 18 వేళ్ళలోపు ఆడపిల్లలకు, 21 వేళ్ళ లోపు మగ పిల్లలకు వివాహం చేయటం చట్టరీత్యా నేరమని, బాల్యవాలను ప్రత్యక్షంగా కాని పరోక్షంగా గాని ప్రోత్సహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవి, అంగన్వాడి టీచర్ బి శిరీష, కృష్ణవేణి, హైమావతి, నాయకులు పెద్ద తిరుపాలు ఆశా, చిన్నారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.



# పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వ రాయితీ

## ఇన్చార్జి మునిసిపల్ కమిషనర్ షేక్షావలి వెల్లడి



**పొదిలి, పెన్ పవర్, మార్చి 18**

పొదిలి పట్టణంలో ఆస్తి పన్ను బకాయిదారులకు ప్రభుత్వం ఊరట ఇచ్చిందని ఇన్చార్జి మునిసిపల్ కమిషనర్ ఎస్. షేక్షావలి చెప్పారు. ఏళ్ల తరబడి చెల్లించకుండా ఉన్న ఇంటి పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. పన్నుల బకాయిదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగ పరచు కోవాలని ఇన్చార్జి కమిషనర్ షేక్షావలి కోరారు. ఈనెల 31 వ తేదీలోపు పన్ను బకాయిలు చెల్లించు వారికి ఈ సదుపాయం ఉంటుందన్నారు. అందువల్ల పన్నుల బకాయిదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగపరచుకోవడం ద్వారా వెంటనే పన్నులు చెల్లించి, పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఇన్చార్జి కమిషనర్ షేక్షావలి కోరారు.

# పొదిలిలో చెప్పులు కుట్టే వారికి గొడుగుల పంపిణీ



**పొదిలి, పెన్ పవర్, మార్చి 18**

పొదిలి పట్టణంలో చెప్పులు కుట్టుకొని జీవనం సాగించే వారికి ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. బుధవారం నాడు లెక్చరర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గొడుగుల పంపిణీ వల్ల రోడ్ల ప్రక్కన చెప్పులు కుట్టుకునే వారికి వేసవిలో ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఆధునిక ఫీచర్లు కలిగిన గొడుగులను అందించినందుకు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

# అనాధాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 18**

శ్రీ వివేకానంద కళాశాల పూర్వ విద్యార్థిని విద్యార్థులు 83/85/88 బ్యాచ్ రంజాన్ పండుగ సందర్భంగా గిద్దలూరు మండలంలో కంచు పల్లె గ్రామం లో తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు నిత్యవసర సరుకులు, బట్టలు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు గ్రూపు సభ్యులు కె పి. కాశయ్య, సూర్య సుబ్బరాయుడు, సాహిద్, ప్రసంగి,, ఇస్మాయిల్, సింగర్ వెంకటేశ్వర్లు, సీసీకేఆర్ మోహన్ రావు, వాడకట్టు వెంకటరమణ, పిచ్చిరెడ్డి, గోపాల్ ఆ కార్యక్రమమునకు పాల్గొని పంపిణీ కార్యక్రమం నిర్వహించారు . మా సేవా కార్యక్రమం ఇలానే కొనసాగుతాయని ఏప్రిల్ 5వ తేదీ ఈస్టర్ పండగ రోజు మానసిక వికలాంగుల స్కూల్లో నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు .

# నవోదయ ఫలితాల్లో సత్తా చాటిన ఆల్ఫా విద్యార్థులు

**పొదిలి, పెన్ పవర్, మార్చి 18,**

నవోదయ పరీక్ష ఫలితాల్లో పొదిలికి చెందిన ఆల్ఫా విద్యార్థులు తమ సత్తా చాటారు. నవోదయ ఫలితాల్లో పొదిలి ఆల్ఫా విద్యా సంస్థకు చెందిన ఎం. ధన్విన్ కుమార్ రెడ్డి, నిఖిల్, అనుష్క తమ ప్రతిభను చూపించి నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఆల్ఫా పాఠశాల డైరెక్టర్ ఎం. మాల కొండారెడ్డి, రితీష్ లాయర్, ప్రిన్సిపాల్ వేల్పుల వెంకట్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



# పాడి పశువులకు త్రిబుల్ ఎస్ ఇంజక్షన్ తప్పనిసరి..

**డివిజన్ ఉప సంచాలకులు దామోదర్ రావు...**



చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 18 .. ఎదకు వచ్చిన ప్రతి పాడి పశువుకు త్రిబుల్ ఎస్ ఇంజక్షన్లు తప్పనిసరిగా రైతులు చేయించాలని ఆ శాఖ విజయనగరం డివిజన్ ఉపసంచాలకులు ఎన్ దామోదర్ రావు సూచించారు .చీపురుపల్లి మండలం పుర్రెయవలస గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పశు ఘణా బివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖఆధ్వర్యంలో కృత్రిమ గర్భ దారణ ద్వారా పుట్టిన ఆడ దూడల ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ను గ్రామ సర్పంచ్ సారిక మోహనరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విజయనగరం డివిజన్ ఉపసంచలకులు డా. ఎన్. దామోదర రావు దూడలను పరిశీలించి వాటి పోషణ విషయంలో తగు సూచనలు తెలియచేశారు. ప్రతి ఒక్కరూ ఎదకు వచ్చిన తమ పాడిపశువు త్రిబుల్ ఎస్ గర్భ దారణ ఇంజక్షన్ లు చేయించుకోవాలని రైతులు కి తెలియచేశారు. ఈ కార్యక్రమం లో 50 మంది రైతులు తమ దూడల ను ప్రదర్శించడం జరిగింది. పాడి రైతులకు బహుమతులు,మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. సిహెచ్.సుబ్రమణ్యం చీపురుపల్లి సహాయసంచలకులు, డి ఎల్ డి ఏ డాక్టర్ జగదీశ్, డాక్టర్.హైమావతి, ఎల్ ఎస్ ఏ వాసు ఏ హెచ్ ఏ లు ,గోపాలమిత్ర గ్రామ ఉప సర్పంచ్ కంది అప్పలనాయుడు, కంది రమణ, సారిక రమణ,గురన సత్యం తదితరులు పాల్గొన్నారు..

# మొక్కజొన్నకు మద్దతు ధర ఇవ్వాలి..



**జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు డిమాండ్..**

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 18 ..** మొక్కజొన్న పండిస్తున్న రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం నాడు చీపురుపల్లి లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు 2400 మద్దతు ధర ఉండగా బయట మార్కెట్లో 1500 నుండి 1600 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని దీని కారణంగా రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి మద్దతు ధరతో రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారని ఆయన వివరించారు. ఒక ఎకరాకు సుమారు 40 క్వింటాల జొన్నలు దిగుబడి అవుతుండగా మార్కెట్లో మొక్కజొన్న రైతులను నిలువు దోపిడీ చేస్తున్న కారణంగా ఒక్కో రైతు ఎకరాకు సుమారు 24 వేల రూపాయలు నష్టపోతున్నాడని ఆయన అన్నారు. ఈనెల 23న జిల్లా వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మొక్కజొన్న రైతులతో మహాధర్నా చేపట్టినట్టు ఈ సందర్భంగా ఆయన వివరించారు. జిల్లా నలుమూల నుండి మొక్కజొన్న రైతులు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రస్తుతం గ్రామాల వారీగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో మొక్కజొన్న రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకుడు అంబల్ల గౌర్నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు కరణం సన్యాసినాయుడు, ఎస్ సీతమ్ నాయుడు, కెల్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన.

- సామాజిక సేవలో ఆదివాసి గిరిజన సంఘం ముందంజ.
- రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర

**హుకుంపేట పెన్ పవర్ మర్చి 18:**హుకుంపేట మండలంలోని బూర్జ పంచాయతీ పరిధిలోని మజ్జివలస గ్రామంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పీపుల్స్ హెల్త్ సొసైటీ సౌజన్యంతో మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో ఈ శిబిరాన్ని ఆదివాసి గిరిజన సంఘం, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ శిబిరాన్ని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యమాలతో పాటు సామాజిక సేవలో కూడా సంఘం ముందంజలో ఉంటుందని తెలిపారు. ఆదివాసుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తూనే వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వైద్య శిబిరంలో డాక్టర్ భాగ్యరాజు, డాక్టర్ రిషి ఆధ్వర్యంలో వైద్య బృందం కంటి పరీక్షలు, బీపీ, షుగర్, కేన్సర్, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. బూర్జ పంచాయతీతో పాటు పరిసర గ్రామాల నుంచి




వచ్చిన అనేక మంది రోగులు పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పొందారు.

రోగులు భారీ సంఖ్యలో హాజరై సేవలు పొందడంతో శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎపిడెమిక్ సీజన్ దృష్ట్యా అల్లూరి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను కొనసాగిస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు వి. లక్ష్మణరావు, టి. కృష్ణరావు, పి. సోమన్న, బాలకృష్ణ, ఎంపీటీసీ మజ్జి హరి, వార్డు సభ్యుడు పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి







- ప్రకృతి లో ఒక రోజు కార్యశాల అవశరం
- మన జీవవైవిధ్యాన్ని మనమే పరిశీలించి కాపాడుకోవాలి
- ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ

**విజయనగరం మార్చి 18(పెన్ పవర్)**ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం గొల్జాం ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు జి సుదర్శనం అధ్యక్షతన ఎపి నేషనల్ గ్రీన్ కార్ప్స్ నేతృత్వంలో ప్రకృతి లో ఒక రోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రకృతి లో ఒక రోజు కార్యశాలలో పాల్గొనడం అవశరం అన్నారు. మన జీవవైవిధ్యాన్ని మనమే పరిశీలించి కాపాడుకోవాలి అని కోరారు. ప్రస్తుతం శీతోష్ణస్థితి వేడెక్కడం వల్ల కలిగే నష్టం అధిగమించడానికి ప్రతి విద్యార్థి పది మొక్కలు నాటి పెంచడం అవసరం అన్నారు.

తులసి నేచరల్స్ ప్రతినిధి సత్యన్నారాయణ మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం అని వివరించారు. రసాయన క్రిమి సంహారకాలు, రసాయన ఎరువులు, రసాయన కలుపు తీత మందులు వినియోగించడం వల్ల భూమి, నీరు విషమయమై సమస్త జీవరాశికీ నష్టం ఏర్పడుతుంది అని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తులసి నేచరల్స్ తూర్పాటి సత్యన్నారాయణ, మేంగోమేన్ అప్పాజీ లో నేతృత్వంలో మొక్కలు నాటారు. జెవి రత్నం నేతృత్వంలో పిచ్చుకల గూళ్ళు, నీటి పాత్రలు, పక్షులకు ఆహారం కోసం పాత్రలు తయారు చేయడం నేర్పించారు. ఎపి ఎన్ జి సి విజయనగరం జిల్లా సమన్వయకర్త బి వేణు ఉన్నత పాఠశాల వెనుక భాగంలో ఉన్న తోటలో వృక్షాలు, మొక్కలు, జీవజాతులు (ఫ్లోరా, ఫానా ) పరిశీలించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జి శ్రీనివాసరావు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# నూతన నోటరి న్యాయవాదిగా మొగల్ అన్వర్ బేగ్



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 18**

మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది మొగల్ అన్వర్ బేగ్‌నీ నోటరీగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రెవిన్యూ (రిజిస్ట్రేషన్) శాఖ జీవో జారీ చేసింది.దింతో మార్కాపురం ప్రాంత ప్రజలకు ఇకపై నోటరీ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, డాక్యుమెంట్ అటెస్టేషన్ వంటి సేవలకు ఆయన అధికారికంగా ధ్రువీకరించనన్నారు. కావున నోటరీ అవసరమైన ప్రజలు కోర్ట్ సెంటర్ వద్ద ఉన్న మొగల్ గెస్ట్ హౌస్ పక్కన ఆయన ఆఫీస్ ను సంప్రదించాలని కోరారు.

# కొమరోలులో ఉరుములు మెరుపులతో కురిసిన కొద్దిపాటి వర్షం



**కొమరోలు పెన్ పవర్ మార్చి 18**

కొమరోలు మండలంలో బుధవారం సాయంత్రం ఆకస్మికంగా ఉరుములు, మెరుపులతో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది. గత పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతూ వచ్చాయి. గత రెండు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండింది. అయితే బుధవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆకాశం మేఘాలతో నిండి వాతావరణం పూర్తిగా మారిపోయింది. కొద్దిసేపు చల్లని గాలులు వీచాయి. అనంతరం ఆకాశం ఉరుములు మెరుపులతో నిండి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఉరుములు మెరుపులతో పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో ప్రజలు పిడుగులను తలుచుకుంటూ ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు .అనంతరం కొద్దిపాటి వర్షం కురుసింది. దీనితో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి చల్లని గాలులు వీయటంతో ప్రజలు ఊరట చెందారు.

# సన్‌రైజర్స్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్.. వైస్ కెప్టెన్‌గా అభిషేక్ శర్మ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) కీలక ప్రకటన చేసింది. రెగ్యులర్ కెప్టెన్, ఆస్ట్రేలియా దిగ్గజం పాట్ కమిన్స్ గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో తొలి కొన్ని మ్యాచ్‌లకు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహిస్తాడని ఫ్రాంచైజీ ప్రకటించింది. యువ సంచలనం అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

"గాయం నుంచి కోలుకుంటున్నందున పాట్ కమిన్స్ కొన్ని మ్యాచ్‌లకు దూరమవుతాడు. అతను తిరిగి వచ్చే వరకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా, అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా ఉంటారు" అని సన్‌రైజర్స్ తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది.

గతేడాది డిసెంబర్ లో వెస్టిండీస్ పర్యటన తర్వాత వెన్ను గాయంతో బాధపడుతున్న కమిన్స్, అప్పటి నుంచి క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఈ గాయం కారణంగానే అతను యాషెస్ సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లు, 2026 టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్ మలి దశలో అతను జట్టుతో చేరే అవకాశం ఉంది. 2025 నుంచి సన్‌రైజర్స్ జట్టులో ఉన్న ఇషాన్ కిషన్, ఇటీవల దేశవాళీ సీజన్‌లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గెలిచిన జార్ఖండ్ జట్టుకు విజయవంతంగా నాయకత్వం వహించాడు. అయితే, ఐపీఎల్‌లో కెప్టెన్‌గా అతనికి ఇదే తొలిసారి కావడం విశేషం. ఐపీఎల్ 2016 విజేత అయిన సన్‌రైజర్స్ హైదరాబాద్, తమ 2026 సీజన్ ను ఈ నెల 28న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB)తో జరగనున్న మ్యాచ్‌తో ప్రారంభించనుంది. ఇక, ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజయంలో ఇషాన్, అభిషేక్ ఇద్దరూ కీలక పాత్ర పోషించారు. అయితే, అనుభవంలో 27 ఏళ్ల ఇషాన్ సీనియర్ కావడంతో అతనికి కెప్టెన్సీ దక్కింది. ఇషాన్ ఇప్పటివరకు 119 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడగా, 25 ఏళ్ల అభిషేక్ 77 మ్యాచ్‌లలో ఆడాడు. కమిన్స్ సారథ్యంలో ఎస్‌ఆర్‌హెచ్ 30 మ్యాచ్‌లు ఆడి 15 విజయాలు సాధించింది. 2024లో జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లగా, గత సీజన్‌లో ఆరో స్థానంలో నిలిచాడు.

# హేజిల్‌వుడ్ ఔట్, వెంకటేష్ అయ్యర్‌కు నో ఛాన్స్.. SRH మ్యాచ్‌కు RCB తుది జట్టు ఇదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బరిలోకి దిగబోతుంది. ఈ ఎడిషన్ లో తమ టైటిల్ ని డిఫెన్స్ చేసుకునేందుకు ప్లాన్ చేస్తుంది. మార్చి 28న ప్రారంభం కానున్న తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తో ఎం. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ తలపడనుంది. కాగా గత సీజన్‌లో టైటిల్ సాధించిన జట్టుని ఆర్సీబీ యాజమాన్యం అలాగే కొనసాగించింది. తక్కువ బడ్జెట్‌తో వేలంలో పాల్గొన్నప్పటికీ టీమ్ ని మరింత బలోపేతం చేసేలా పలు నిర్ణయాలు తీసుకుంది. కెప్టెన్‌గా రజత్ పటిదార్ కే మళ్లీ బాధ్యతలు అప్పగించింది. 2025 సీజన్‌లో గాయంతో ఇబ్బంది పడినప్పటికీ ఈసారి మంచి ప్రదర్శన ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఓపెనింగ్‌లో ఫిల్ సాల్ట్-- విరాట్ కోహ్లీ జోడీ మళ్లీ జట్టుని ముందుండి నడిపించనుంది. గత సీజన్‌లో ఈ జోడీ జట్టుకు అద్భుతమైన ప్రదర్శనలతో టీమ్ విజయాల్లో కీలక పాత్ర పోషించింది. నెంబర్-3లో దేవదత్ పడిక్కల్ స్థానం దాదాపు ఫిక్స్ కావడంతో.. వెంకటేష్ అయ్యర్‌కు స్టార్టింగ్ మ్యాచ్‌లో అవకాశం దక్కకపోవచ్చు. ఇక మిడిల్ ఆర్డర్‌లో టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రోమారియో షెఫర్డ్ కీలక పాత్ర పోషించనున్నారు. అలాగే ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా కూడా జట్టులో కీలకంగా మారనున్నాడు. అలాగే బౌలింగ్ విభాగంలో ఆర్సీబీకి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ గాయంతో పలు మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం కనిపిస్తుంది. అతని స్థానంలో జాకబ్ డఫీ లేదా నువాన్ తుషారా టీమ్ లోకి వచ్చే ఛాన్స్ ఉంది. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు పేస్ విభాగాన్ని భువనేశ్వర్ కుమార్ నడిపించనున్నాడు. స్పిన్ విభాగంలో సుయాష్ శర్మ కీలక పాత్ర పోషించే ఛాన్స్ ఉంది. యువ ఆటగాళ్లు మంగేష్ యాదవ్, రసీఖ్ సల్మాన్ దార్ కూడా తుది జట్టులో స్థానం కోసం పోటీ పడుతున్నారు. దీంతో గత సీజన్‌లో విజయాన్ని అందించిన ఓపెనింగ్ కాంబినేషన్‌ను కొనసాగిస్తూ, నాలుగు మార్పులతో ఆర్సీబీ కొత్త సీజన్‌కు రెడీ అయింది. టైటిల్ డిఫెన్స్‌లో ఆర్సీబీ ఎలా రాణిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అంచనా:**

ఆర్సీబీ జట్టు: ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పటిదార్(కెప్టెన్), టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రోమారియో షెఫర్డ్, కృనాల్ పాండ్యా, జాకబ్ డఫీ, భువనేశ్వర్ కుమార్, సుయాష్ శర్మ.

# టెస్టుల్లో భారత జట్టు వైఫల్యాలు.. గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు






**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జాతీయ క్రికెట్ జట్టుకు వైట్‌బాల్ క్రికెట్‌లో గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అద్భుతమైన విజయాలను నమోదు చేసింది. 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, 2025, 2026లలో వరుసగా టీ20 వరల్డ్ కప్ ని కైవసం చేసుకుంది. కానీ టెస్ట్ క్రికెట్‌లో మాత్రం భారత జట్టు ఆశించిన మేర స్థాయిలో ప్రదర్శన చేయడం లేదు. బంగ్లాదేశ్, వెస్టిండీస్‌పై మాత్రమే సిరీస్‌లు గెలిచిన భారత్, స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 3---0తో వైట్‌వాష్‌కు గురి కావడం, 2024- 25 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీను కోల్పోయింది.. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 2- 2తో డ్రా చేసుకున్నప్పటికీ.. దక్షిణాఫ్రికాతో 2- 0 తేడాతో పరాజయం పాలైంది.టెస్టుల్లో భారత జట్టు ప్రదర్శనపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పందిస్తూ.. జట్టు ప్రస్తుతం ట్రాన్సిషన్ దశలో ఉందని పేర్కొన్నారు. న్యూజిలాండ్ సిరీస్ ఆడిన జట్టు, దక్షిణాఫ్రికా సిరీస్ ఆడిన టీమ్ పూర్తిగా భిన్నం.. ఈ రెండు సిరీస్‌లను ఒకేలా చూడటం సరికాదు.. జట్టు ఫలితాల బాధ్యత నాదే.. విమర్శలు స్వాగతిస్తాను.. కానీ జట్టు మార్పు దశలో ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఆయన తెలిపారు. అలాగే ఇంగ్లాండ్‌లో భారత్ సాధించిన విజయాలను కూడా గుర్తు చేశారు. కాబట్టి ఒక్క సిరీస్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం తగదని గంభీర్ సూచించారు. న్యూజిలాండ్ సిరీస్ సమయంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉన్నారు.. వీరిద్దరూ 2025 మేలో టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో రోహిత్ ఫామ్‌లో లేకపోవడంతో చివరి టెస్ట్‌కు తానే తప్పుకున్నాడు.. అనంతరం టెస్ట్ జట్టుకు కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేసిన సెలక్షన్ కమిటీ, శుభ్‌మన్ గిల్ ని కెప్టెన్‌గా, రిషభ్ పంత్ ని వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. గిల్ నాయకత్వంలో ఇంగ్లాండ్‌లో జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చినప్పటికీ, స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో ఘోరంగా ఓడిపోయింది.

# అత్యంత ధనవంతుల జాబితాలో సౌత్ లేడీ స్టార్స్.. హైయెస్ట్ ఎవరంటే?

సినీ ఇండ్రస్ట్రీ లో కథానాయికలు కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, బాక్సాఫీస్ వద్ద తమకంటూ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్నారు. సంపాదనలో కూడా హీరోలకు గట్టి పోటీనిస్తూ భారీ ఆస్తులను కూడబెడుతున్నారు. నయనతార నుంచి సమంత వరకు, రష్మిక మందన్న నుంచి త్రిష వరకు టాప్-7 ధనవంతులైన నటీమణుల జాబితా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మార్చి 2026 నాటి అంచనాల ప్రకారం వీరి నికర ఆస్తుల విలువ ఎంత వుందో తెలిస్తే ఆశ్చర్యపోతారు. మరి ఆ వివరాలు చూద్దాం..

**అగ్రస్థానంలో లేడీ సూపర్ స్టార్ నయనతార:**

సౌత్ ఇండియాలోనే అత్యంత ధనవంతురాలైన నటిగా నయనతార మొదటి స్థానంలో నిలిచారు. 41 ఏళ్ల ఈ 'లేడీ సూపర్ స్టార్' నికర ఆస్తి విలువ ప్రస్తుతం రూ. 200 కోట్లకు పైగానే ఉన్నట్లు సమాచారం. ఇక ఫోర్బ్స్ ఇండియా సెలబ్రిటీ లిస్టులో చోటు దక్కించుకున్న ఏకైక సౌత్ నటిగా ఆమె రికార్డు సృష్టించారు. ఆమె తర్వాత 'బాహుబలి' ఫేమ్ అనుష్క శెట్టి రూ. 135 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. స్వీటీ ఒక్కో సినిమాకు రూ. 5 నుంచి 7 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటూ తన హవా కొనసాగిస్తోంది.

**తమన్నా, సమంతల మధ్య గట్టి పోటీ:**



ఇక మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా, స్టార్ బ్యూటీ సమంత రూత్ ప్రభు ఇద్దరూ దాదాపు సమానమైన ఆస్తులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. తమన్నా నికర ఆస్తి రూ. 110-120 కోట్లు ఉండగా, ఆమె ఒక్కో సినిమాకు రూ. 4 నుంచి 5 కోట్లు వసూలు చేస్తోంది. ఇక సమంత కూడా రూ. 110-120 కోట్ల ఆస్తులతో ఆమెకు గట్టి పోటీనిస్తోంది. సమంత క్రేజ్‌ను బట్టి ఒక్కో ప్రాజెక్టుకు రూ. 3 నుంచి 8 కోట్ల వరకు తీసుకుంటోంది. వీరిద్దరూ సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు.


**సీనియర్ భామల సత్తా.. త్రిష, కాజల్:**

ఇక రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న త్రిష కృష్ణన్, కాజల్ అగర్వాల్ కూడా ఈ జాబితాలో టాప్ లో ఉన్నారు. త్రిష ఆస్తుల విలువ రూ. 85 నుంచి 100 కోట్ల మధ్య ఉండవచ్చని అంచనా. ఇక 40 ఏళ్ల కాజల్ అగర్వాల్ కూడా తన టోటల్ కెరీర్‌లో రూ. 85 కోట్ల వరకు ఆస్తులను కూడబెట్టుకున్నారు. అప్పట్లో 'మగధీర' వంటి సినిమాలతో టాప్ రేంజ్‌కు వెళ్లిన కాజల్, పెళ్లయ్యాక కూడా మంచి ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ తన ఆర్థిక స్థితిని పటిష్టంగా ఉంచుకున్నారు.

**నేషనల్ క్రష్ రష్మిక దూకుడు:**

ప్రస్తుతం పాన్-ఇండియా లెవల్లో ఫుల్ డిమాండ్ ఉన్న నటి రష్మిక మందన్న. కేవలం 29 ఏళ్ల వయసులోనే ఆమె రూ. 66 కోట్ల ఆస్తులను సంపాదించారు. 'పుష్ప 2' కోసం రూ. 10 కోట్లు, సల్మాన్ ఖాన్ 'సికిందర్' కోసం ఏకంగా రూ. 13 కోట్లు తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల వివాహం చేసుకున్న రష్మిక, ఈ జాబితాలో అందరికంటే చిన్న వయసులోనే కోట్లకు పడగలెత్తిన నటిగా నిలిచింది.

భవిష్యత్తులో ఆమె ఆస్తుల విలువ ఇంకా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.సౌత్ లేడీ స్టార్స్ తమ కష్టంతో మరియు టాలెంట్‌తో ఈ స్థాయికి చేరుకోవడం నిజంగా అభినందనీయం. కేవలం సినిమాలే కాకుండా వ్యాపార రంగంలో కూడా పెట్టుబడులు పెడుతూ తమ ఆర్థిక భవిష్యత్తును ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ జాబితా చూస్తుంటే దక్షిణాది నటీమణుల స్టార్ పవర్ బాలీవుడ్ భామలకు ఏమాత్రం తీసిపోదని అర్థమవుతోంది.



**శ్రీముఖి యొక్క బోల్డ్ మ్యాడ్‌నెస్: "మేడ్ ఫర్ ఈచ్ అదర్" వైబ్స్**



**ప్రతిభా రంతా యొక్క రాయల్ ప్రకాశం: జాతి సంపద**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com